



హెలికాప్టర్ నుంచి సముద్రంలో ఉన్న బోటుపైకి దిగుతున్న కమెండోలు



పీ8 విమానం నుంచి బాంబులు వేస్తున్న దృశ్యం

కళ్ల ముందు కదనరంగం

» ఆకాశంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల చక్కర్లు
» సముద్రంలో ఆయిల్ రిగ్‌ల పేల్చివేత
» తీరానికి సమీపంలో బారులుతీరిన యుద్ధ నౌకలు
» వేల అడుగుల ఎత్తు నుంచి కిందకు దిగిన మార్కోలు



విన్యాసాలు తిలకిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, మనుమడు దేవాన్ష్, తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్

ఆద్యంతం కట్టిపడేసిన నేవీ సాహస విన్యాసాలు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందు ఆవిష్కృతమైన కదన రంగాన్ని విశాఖ ప్రజలు శనివారం సాయంత్రం కళ్లు అప్పగించి చూశారు. ఆకాశంలో ఎగురుతూ వచ్చిన హెలికాప్టర్ నుంచి మెరైన్ కమెండోలు తాడు సాయంతో కిందకు దిగి అక్కడ అప్పటికే సిద్ధంగా ఉన్న జెమినీ బోట్లలో తీరానికి చేరుకొని శత్రుస్థావరంపై చేసిన దాడి, శత్రు దేశాల ఆర్థిక సంపదను నాశనం చేస్తున్నట్టు సముద్రంలో ఆయిల్ రిగ్‌ల పేల్చివేత...నిజంగా యుద్ధ వాతావరణాన్నే తలపించింది.


నేవీ డే సందర్భంగా డిసెంబరు 4న విన్యాసాల ప్రదర్శన ఈసారి పూరీ తీరంలో రాష్ట్రపతి ఎదుట నిర్వహించారు. విశాఖ ప్రజల కోసం మరోసారి శనివారం సాయంత్రం ప్రదర్శించారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భార్య భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. తొలుత ఎనిమిది వేల అడుగుల ఎత్తులో గల అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ నుంచి దూకిన నలుగురు మార్కోలు పారాచ్యూట్ల సాయంతో లాఘవంగా ముఖ్య

... మిగతా 6వ పేజీలో



కనువిందు చేసిన లేజర్ షో

ఆర్థిక రాజధానిగా విశాఖ



» నాలెడ్జ్ హబ్, మారీటైమ్ గేట్‌వేగా రూపాంతరం
» డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఒప్పందం
» భవనం ఎంపిక చేసుకున్న టీసీఎస్
» మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం నిర్మాణం పూర్తి
» 8న రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన
» స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తాం
» ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి జలాలు.. వచ్చే ఏడాది విశాఖకు
» నేవీ సేవలు మరువలేనివి
» నేవీ ఆపరేషన్ డెమోలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మారనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్‌కే బీచ్‌లో తూర్పు నౌకాదళం శనివారం సాయంత్రం నిర్వహించిన సాహస విన్యాసాల ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖ మేటి నగరంగా తయారవుతుందన్నారు. పర్యాటక రాజధానిగా, నాలెడ్జ్ హబ్ సిటీగా, మారీటైమ్ గేట్‌వేగా

... మిగతా 6వ పేజీలో



పారాచ్యూట్‌లో దిగుతున్న స్కైడైవర్స్



నేవీ విన్యాసాలను తిలకిస్తున్న జనం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు వడ్డించిన భోజనం

» ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో ప్రారంభం
» జిల్లాలో 5,600 మందికి ప్రయోజనం
» మహిళా కళాశాలలో పథకాన్ని ప్రారంభించి విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి



విశాఖపట్నంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, తొమ్మిది హైస్కూల్ ప్లస్‌లలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేసింది. అయితే 2019లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో 5,600 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనున్నది.

నగరంలో వీఎస్ కృష్ణా జూనియర్, ఒకేషనల్ కళాశాలలు, మహిళా జూనియర్ కళాశాల ఉన్నా యి. ఇంకా మల్కాపురం, పెందుర్తి, అగనంపూడి, ఇస్లాంపేట, మధురవాడ, ఆనందపురం, భీమిలిల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అలాగే రాంపురం, గోపాలపట్నం, గాజువాక, గంగవరం, రెడ్డిపల్లి, హెచ్.వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలు, వన్‌టౌన్‌లోని ఎంవీడీఎం, సీతమ్మధార నెహ్రూ మునిసిపల్ స్కూలు, మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ ఉన్నాయి. జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో కలిపి

... మిగతా 6వ పేజీలో

ప్రధాని సభకు జన సమీకరణపై కసరత్తు

» ఏయూలో సభకు 1,40,000 మంది, రోడ్‌షోకు 60 వేల నుంచి 70 వేల మంది...
» జనం తరలింపునకు 2,000 బస్సులు
» ఏర్పాట్ల పర్యవేక్షణకు పొరుగు జిల్లాల నుంచి ఐఏఎస్ అధికారులు
» మరో 10 మంది డిప్యూటీ కలెక్టర్లు, 20 మంది తహసీల్దార్లు
» అన్ని శాఖల అధికారులతో 42 కమిటీలు ఏర్పాటు



ప్రధాని సభకు ఏర్పాట్లు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఎనిమిదో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ నగర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు ఐఏఎస్ అధికారులను ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ అశోక్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తోపాటు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంతకుమార్‌రెడ్డిలకు ప్రధాని పర్యటనకు సంబంధించి పలు బాధ్యతలు అప్పగించారు. వీరు కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మరో పది మంది డిప్యూటీ కలెక్టర్లు, 20 మంది తహసీల్దార్లు, ఇంకా రవాణ, పౌర సరఫరాలు, రోడ్లు, భవనాల శాఖల నుంచి అధికారులను నియమించారు. జన సమీకరణ, బహిరంగ సభ, వేదిక, గ్యాలరీల ఏర్పాటు, ఇతర పనుల పర్యవేక్షణ నిమిత్తం మొత్తం 42 కమిటీలు వేశారు. ప్రతి కమిటీకి జిల్లా అధికారి ఒకరు నేతృత్వం వహిస్తారు.

రెండు లక్షల మంది జనాల సమీకరణ లక్ష్యం

ప్రధాని సభకు రెండు లక్షల మందిని సమీకరించాలని జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అనకాపల్లి జిల్లా నుంచి 40 వేలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పది వేల నుంచి 20 వేలు, నగరానికి ఆనుకుని ఉన్న నాలుగు గ్రామీణ మండలాల నుంచి 10 వేలు, మరో 1.2 లక్షల మందిని నగరం నుంచి తరలించాలని యోచిస్తోంది. సభా వేదిక ముందు రెండు పెద్ద హాళ్ల

... మిగతా 6వ పేజీలో

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి శనివారం మధ్యాహ్నం 3.50 గంటలకు ప్రత్యేక విమానంలో వచ్చిన సీఎంకు ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. విమానాశ్రయం బయట కార్యకర్తల నుంచి చంద్రబాబునాయుడు వినతులు స్వీకరించారు. అనంతరం ఆర్కే బీచ్‌లో నౌకాదళం నిర్వహించే సాహస విన్యాసాల ప్రదర్శనను తిలకించేందుకు బయలుదేరి వెళ్లారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ప్రభుత్వ విప్ పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జీ, కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, డీసీపీ డి.మేరీ ప్రశాంతి, ఆర్డీవో పి.శ్రీలేఖ ఉన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

చిన్నపిల్లలు తప్పిపోతే ఆర్‌ఎఫ్ఐడీ ద్వారా గుర్తింపు

» నేవీ డే సందర్భంగా తొలిసారి అమలుచేసిన విశాఖ పోలీసులు



నేవీ విన్యాసాలు సందర్భంగా చిన్నపిల్లల చేతికి క్యూఆర్‌కోడ్ ట్యాగ్‌లను వేస్తున్న పోలీసులు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాలు, జాతరల సందర్భంగా చిన్న పిల్లలు తప్పిపోతే వారిని తక్షణం గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించేందుకు విశాఖ

... మిగతా 6వ పేజీలో

నేడే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'కు సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ...ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (9985411659, 9492452283) చేయించుకోవాలి. పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ముందుగా వచ్చిన వారికి మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం లభించనుంది.



పాఠశాలల అభివృద్ధికి చర్యలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి వీరాంజనేయస్వామి
- అంధ బాలికల పాఠశాలలో ఘనంగా బ్రెయిలీ జయంతి



కేక్ కట్ చేస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి

సాగర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగు నింపారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం ఆయన బీచ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దివ్యాంగుల పింఛన్ రూ. 3 వేలు నుంచి రూ. 6 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. పింఛన్లపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం సిగ్గుచేటన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్ అందిస్తామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి పుస్తకాలు అందిస్తామన్నారు.దివ్యాంగులకు కూడా ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఉంటుందన్నారు.అలాగే విశాఖలో దివ్యాంగుల కోసం రూ. 200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మించనున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాలికల సమక్షంలో కేక్ కట్ చేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దివీస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఆర్‌డీఓ సంగీత్ మాథుర్, తహసీల్దార్ పాల్‌కిరణ్, ప్రిన్సిపాల్ ఎస్‌కే నూర్జహాన్ తదిత రులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఘనంగా జరిగింది. ఎంఈఓ ఎం. శివరాణి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఐఈఆర్‌పీలు కెజియా కుమారి,పార్వతి, సీఆర్‌పీ శివదయాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న రంగోత్సవ్ పోటీలు

భీమునిపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో ఈనెల 7న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. ఎనిమిది అంశాల్లో పోటీలు జరుగుతాయని, జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 9052 423757,9441465299 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ఎండాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ-రుషికొండ మార్గంలో కొంతకాలంగా తాగునీటి పైప్‌లైన్ నుంచి నీరు లీక్ అవుతుండడంతో సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను ఆ వార్డు జనసేన అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.



ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను వచ్చే నెల 1,2 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉత్సవ్ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. శనివారం పాఠశాలలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఉత్సవ్ కమిటీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాఠశాలకు రంగులు, గేటు, పైలాన్ ఏర్పాటు తదితర పనులను ప్రారంభించడానికి సమీక్షలు చేశామన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీను, కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు, ఉపాధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు, సభ్యులు కాళ్ల సన్ని, తట్టికోట భీమారావు, రాజేటి బసవ కృష్ణమూర్తి, చిలకా వెంకటరమణ, పైడిపల్లి నరసింగరావు, లచ్చు బుగత గణపతి, బొండా బాలాజీ, మారోజు గోపి,కందుకూరి పద్మనాభ స్వామి, దారపు అప్పారావు, కుప్పిలి ఉమామహేశ్వరరావు, ఎల్. ఆదినారాయణ, కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైకుంఠ ఏకాదశి టికెట్ల విక్రయం

సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో ఈనెల 10న జరిగే ఉత్తర దర్శనం (వైకుంఠ ఏకాదశి) పురస్కరించుకుని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రవేశపెట్టిన రూ.500 టికెట్ల విక్రయాలను సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 9 వరకు ప్రత్యేక టికెట్ల అమ్మకాలు జరుగుతాయన్నారు. సింహగిరిపై పాత పీఆర్‌ఓ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 9 నుంచి 5 వరకు అందుబాటులో ఉంటాయని, దేవస్థానం వెబ్ సైట్ ద్వారా కూడా కొనుగోలు చేసుకోవచ్చునని చెప్పారు.

వైభవంగా పగల్‌పత్ ఉత్సవం



సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పగల్ పత్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సుప్రభాత, ప్రభాత సేవలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను ప్రత్యేక పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో మంగళ్య వాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ బేడా మండప తిరువీధి జరిపారు.అనంతరం స్వామివారిని ఆస్థాన మండపంలో పూజలు జరిపి, నాలాయిర దివ్యప్రబంధంలోని పాశురాలను విన్నవించారు. ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ఇంటర్ విద్యార్థులకు 'భోజనం' ప్రారంభం



భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

భీమునిపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, 1వ వార్డు వైసీపీ నాయకుడు అక్కరమాని రామునాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు, చిన్నికుమారి లక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకాన్ని రద్దు చేసిందన్నారు. దీనివల్ల కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం ఘోరంగా పడిపోయిందని, చాలామంది నిరుపేద పిల్లలు ఉన్నత చదువులకు దూరమై పనులకు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వ కళాశాలల్లో మళ్లీ ఈ పథకాన్ని పునఃప్రారంభించిందన్నారు. విద్యార్థులు పథకాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, తెలుగు యువత నాయకుడు కనకల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు కొక్కిరి అప్పన్న, సంకురుభుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, సిద్ధార్థ వర్మ, మరుపిళ్ల రమణ, నక్కిళ్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

ఓవరాల్ ఛాంపియన్స్ సాయి గణపతి, భీమిలి జట్లు



భీమిలి జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న వెంకటేశ్వర్రావు

కంచరపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 27వ రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 24 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా బాక్సింగ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర్రావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్స్ బాలుర విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాల, (గిరిజాల), బాలికల విభాగంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల జట్లు నిలిచాయి.వ్యక్తిగత చాంపియన్లుగా ఎన్.ఈశ్వర్ వర్ధన్, ఎస్.మల్లేశ్వరి (సాయిగణపతి కళాశాల) ఎంపికయ్యారు.

ప్రధాని సభకు జన సమీకరణపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

నిర్మిస్తున్నారు. ఒక దాంట్లో 60 వేలు, మరో దాంట్లో 40 వేలు కుర్చీలు వేస్తున్నారు. ఇంకా రెండు హాళ్లలో కలిపి రెండు వేల మందికి సరిపడేలా 50 గ్యాలరీలు ఏర్పాటుచేస్తున్నారు. మిగిలిన వారు సభా ప్రాంగణం బయట ఉంటారు. వీరంతా ప్రధాని, ఇతర ప్రముఖల ప్రసంగాలు వినేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి సభా వేదిక వరకు ప్రధాని రోడ్‌షోలో 60 నుంచి 70 వేల మంది పాల్గొనేలా జనాలను సమీకరిస్తున్నారు. సభ, రోడ్‌షోకు జనాలను తరలించడానికి ఆర్టీసీ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన రెండు వేల బస్సులు తీసుకుంటున్నారు. జనాల తరలింపునకు మొత్తం 300 పాయింట్లు గుర్తించారు. బస్సులు ఇటు మద్దిలపాలెం, అటు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో జనాలను దించేసి ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాలకు వెళతాయి. ప్రతి పార్కింగ్ కేంద్రానికి డిప్యూటీ కలెక్టర్/జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సభ ముగిసిన తరువాత జనాలు మద్దిలపాలెం, త్రీటౌన్ జంక్షన్‌లకు వచ్చి బస్సుల్లో ఇళ్లకు వెళ్లేలా ముందుగానే వారికి సమాచారం ఇవ్వనున్నారు.

మధ్యాహ్నం పులిహోర, రాత్రికి బిర్యానీ

ప్రధాని సభకు హాజరయ్యే వారికి మధ్యాహ్నం పులిహోర, పెరుగు చట్నీ,వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాక్‌తో కూడిన ప్యాకెట్ అందజేస్తారు. అలాగే రాత్రికి వెజ్ బిర్యానీ, పెరుగుచట్నీ, వాటర్ బాటిల్‌తో మరో ప్యాకెట్ ఇవ్వాలని నిర్ణయించారు. జనాలను పికప్ చేసుకునేందుకు 300 పాయింట్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఇచ్చేందుకు 1.2 లక్షల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. సభ అనంతరం అనకాపల్లి జిల్లాకు చెందిన వారికి 40 వేల మందికి, విజయనగరం/శ్రీకాకుళం వెళ్లే 20 వేల మందికి, జిల్లాలో నాలుగు గ్రామీణ మండలాలకు చెందిన 10 వేల మందికి పంపిణీ చేసేందుకు వెజ్ బిర్యానీ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. కాగా ప్రధాని రోడ్‌షోలో పాల్గొనే 60 నుంచి 70 వేల మందికి స్నాక్స్, వాటర్ బాటిల్ అందిస్తారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల పౌర సరఫరాల అధికారులు భాస్కరరావు, సూర్యప్రకాశ్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, ఇతర అధికారులు ఆహారం తయారీ, పంపిణీ బాధ్యతలు పర్యవేక్షించనున్నారు.

నేడు అడివివరం సొసైటీ మహాజన సభ

సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అడివివరం సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం జరగనున్నట్టు పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చిన్న పిల్లలు తప్పిపోతే ఆర్‌ఎఫ్‌ఐడీ ద్వారా గుర్తింపు

... 5వ పేజీ తరువాయి

నగర పోలీసులు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్ ఐడీ) తీసుకువచ్చారు. బీచ్‌రోడ్డులో శనివారం జరిగిన నేవీ విన్యాసాలు సందర్భంగా తొలిసారి దీన్ని అమలు చేశారు. నేవీ విన్యాసాలను వీక్షించేందుకు తల్లిదండ్రులతో కలిసి బీచ్‌కు వచ్చిన ఐదేళ్లలోపు పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, ఫోన్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను క్యూఆర్ కోడ్ రూపంలో ట్యాగ్‌పై ముద్రించారు. ఆ ట్యాగ్‌లను పిల్లల చేతికి అతికించారు. ఎవరైనా పిల్లలు తప్పిపోయినప్పుడు వారి వివరాలను చెప్పలేరు కాబట్టి, తమ సెల్‌ఫోన్ ద్వారా చేతికి ఉన్న ట్యాగ్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మొత్తం సమాచారం తెలుసుకోవచ్చు. వాటి ఆధారంగా పిల్లలను వారి తల్లిదండ్రులకు వెంటనే అప్పగించేందుకు వీలుంటుంది. నేవీ విన్యాసాల సందర్భంగా బీచ్‌కు వచ్చిన రెండు వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేసినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాని స్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో మహిళా అభ్యర్థులకు శనివారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. మహిళా పోలీసు అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. తొలుత సర్టిఫికెట్లు పరిశీలించి, మైదానంలోకి అనుమతించారు. 718 అభ్యర్థులకు 307 మంది హాజరయ్యారు. పురుషుల అభ్యర్థులకు కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మోహనరావు, డీఎస్పీ అప్పారావు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండదిగువ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో తిరుప్పావై ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం వేకువజామున సుప్రభాతసేవ తరువాత ప్రభాతారాధనలు జరిపి ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. షోడశోపచరాల పూజలు చేసిన తరువాత ఆలయ అర్చకులు భక్తులతో కలిసి తిరుప్పావైలోని 20వ పాశురాన్ని విన్నవించారు.

బెటాలియన్‌లో ముగిసిన క్రీడా పోటీలు

కొమ్మాది, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు క్రీడల వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు.బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా వార్షికోత్సవం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పాల్గొన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూపాంతరం చెందుతుందన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఒప్పందం చేసుకుందని, ఇప్పటికే టీసీఎస్ భవనం కూడా ఎంపిక చేసుకుందన్నారు. మరిన్ని ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 8న ప్రధాని విశాఖలో రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తున్నామన్నారు. మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, త్వరలో విశాఖకు మెట్రో రైలు కూడా వస్తుందన్నారు. నగరంలో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియంతో పాటు టీయూ-142 కూడా తామే ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరొకటి యుహెచ్-3హెచ్ మ్యూజియం వస్తుందన్నారు. రాష్ట్రంలో వేయి కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉందని, మౌలిక వసతులు కల్పించినట్టయితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సంపద పెరుగుతుందన్నారు. గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాదే అనకాపల్లి జిల్లాకు తీసుకువస్తామని, వచ్చే ఏడాది విశాఖపట్నం తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. దేశ రక్షణలో కీలకంగా ఉండే నౌకాదళం రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కూడా అదే చొరవతో ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నదని ప్రశంసించారు.

హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు తాను పది రోజులు ఇక్కడే ఉండి అన్నీ సరిచేశానని, ఆ సమయంలో నేవీ అందించిన సహకారం మరువలేనిదన్నారు. విశాఖలో తూర్పు నౌకాదళం ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తుఫాన్లు వచ్చిన ప్రతిసారి మత్స్యకారులను రక్షించడంలో కీలక పాత్ర వహిస్తుందన్నారు.

నేటి నుంచి గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్

సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ గురుకుల పాఠశాలలో ఆదివారం నుంచి జోనల్ స్థాయి స్పోర్ట్స్‌మీట్ జరగనున్నట్టు ప్రిన్సిపాల్ రమా మోహిని తెలిపారు. శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు.

శిల్పారామంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

మధురవాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో దివీస్ కంపెనీ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను అధికారులు శనివారం ప్రారంభించారు. సుమారు రూ. 18 లక్షలతో దీన్ని ఏర్పాటు చేశారు.

క్విజ్ పోటీలో చిట్టివలస విద్యార్థి ప్రతిభ

తగరపువలస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎ. సాయివర్ధన్ జిల్లాస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానం పొందారు. నగరంలోని తోటగరువు పాఠశాలలో గురు, శుక్రవారం జరిగిన ఈ పోటీలో సాయివర్ధన్ పలు అంశాల్లో ప్రతిభ చూపడంతో విజేతగా ఎంపిక చేసి, రూ.1,500 నగదు బహుమతి అందించారు.ఈమేరకు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జగన్నాథస్వామి విద్యార్థిని అభినందించారు.

'మాలల కోసం వైసీపీ చేసింది శూన్యం'

తగరపువలస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో మాలలకు చేసిందేమీ లేదని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లుగా విభజించి చైర్మన్లను నియమించినా.. ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని విమర్శించారు. శనివారం ఆయన తగరపువలసలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. అనంతరం వర్గీకరణకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటం

తగరపువలస, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ దశల వారీగా పోరాటం చేయనున్నట్టు సీపీఐ నాయకులు తెలిపారు. శనివారం వారు తగరపువలస బీఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపు వల్ల వల్ల సామాన్యులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తమిళనాడు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు, నష్టదాయకమైన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసిందని, కూటమి కూడా ప్రజలకు మేలు చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన నాయకులు

మధురవాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్‌లో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని పౌర సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, కూటమి నాయకులు పిళ్లా వెంకటరావు, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్ శనివారం ఆసుపత్రిని సందర్శించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

... 5వ పేజీ తరువాయి

మొత్తం 5,600 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.వీరిలో తొలిరోజు 4,800 మంది భోజనం చేశారు. పది జూనియర్ కళాశాలలు, నాలుగు హైస్కూల్ ప్లస్‌లకు అక్షయపాత్ర భోజనం అందించగా, మరో ఐదు హైస్కూల్ ప్లస్‌లలో అక్కడ ఉన్నత పాఠశాలల్లో పిల్లలకు భోజనం వండే స్వయంశక్తి సంఘాలే సిద్ధం చేశాయి. నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన పోషకాహారం లభించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కాగా, అగనంపూడి జూనియర్ కళాశాలలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నగరంలోని కృష్ణా జూనియర్ కళాశాలలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పథకాన్ని ప్రారంభించారు. మిగిలిన చోట్ల స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇంటర్ విద్యాశాఖ అధికారులు పథకం ప్రారంభించి పిల్లలతో భోజనం చేశారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో భోజనం పథకం ప్రారంభమైందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ, డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

విద్యా కమిటీలకు శిక్షణ

భీమునిపట్నం (రూరల్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆ పాఠశాలలో విద్యా కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

కళ్ల ముందు కదనరంగం

... 5వ పేజీ తరువాయి

అతిథులు ఆసీనులైన వేదిక వద్ద దిగి శభాష్ అనిపించుకున్నారు. సముద్రంలో కదులుతున్న యుద్ధ నౌకలపై హెలికాప్టర్లను సురక్షితంగా దించడం, తిరిగి టేకాఫ్ తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అటువంటి సాహసాన్ని అలవోకగా చేసి చూపించారు.ఐఎన్‌ఎస్ సహ్యాద్రి నౌకపైకి చేతక్ హెలికాప్టర్‌ను, ఐఎన్‌ఎస్ మైసూర్, ఐఎన్‌ఎస్ ఢిల్లీ నౌకలపైకి అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, స్టెల్త్ ఫ్రిగేట్ నౌక ఐఎన్‌ఎస్ సాత్పురపైకి సీ కింగ్ హెలికాప్టర్లను దించి పైలట్లు నైపుణ్యాన్ని చాటారు. సముద్రంలో చిక్కుకుపోయిన వారిని డబుల్ ఇంజన్ కలిగిన అడ్వాన్స్‌డ్ ఏఎల్ హెలికాప్టర్‌లో వచ్చి రక్షించిన విధానం ఎంత కష్టతరమైనదో అందరికీ అర్థమైంది. సముద్రంలో బారులు తీరిన యుద్ధనౌకలు ఐఎన్‌ఎస్ ముంబై, కిల్తాన్, కవరత్తిల నుంచి సబ్‌మెరైన్‌లను మట్టి కరిపించే రాకెట్లను ప్రయోగించి ఆహా అనిపించారు. చివరిగా నాలుగు చేతక్ హెలికాప్టర్లు, ఒక సీ కింగ్ హెలికాప్టర్, మూడు ఏఎల్ హెలికాప్టర్లు, నాలుగు డార్నియర్ విమానాలు, ఒక నిఘా విమానం పీ8ఐ, ఏడు హాక్ జెట్ విమానాలు ఒక బృందం తరువాత మరొక బృందం వేదిక ముందుగా వచ్చి అతిథుల ముందు నిర్వహించిన ఫ్లై పాస్ట్ కనువిందు చేసింది. సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ వేల అల్లంత దూరం నుంచి అందరికీ హాయ్ చెప్పి కనుమరుగైంది. ప్రదర్శన అనంతరం ఐఎన్‌ఎస్ సావిత్రి యుద్ధనౌక నుంచి చేసిన లేజర్ షో అలరించింది. డ్రోన్లతో ఆకాశంలో ఆవిష్కరించిన నమూనాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. నేవీ బ్యాండ్ బీటింగ్ రిట్రీట్ ప్రదర్శన, సీ క్యాడెట్ల నృత్యం, సెయిలర్ల కంటిన్యూవిటీ డ్రిల్, హార్న్ పైప్ డ్యాన్సు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి : ప్రణవ్ గోపాల్

విశాలాక్షినగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తెన్నేటిపార్కు పక్కనున్న రాక్ పార్కుకు కేటాయించిన స్థలం కంటే ఎక్కువ ఆక్రమించిన రెస్టారెంట్ నిర్వాహకులపై వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన రెస్టారెంట్ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థల ఆక్రమణపై గతంలో నోటీసులు ఇచ్చినా, నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని ఆయన గుర్తించారు. తక్షణమే ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మళ్లీ నోటీసులు జారీ చేయాలని సూచించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



లిల్లీ పూలతో అలంకృతుడైన సుబ్రహ్మణ్య స్వామి

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో గల శ్రీవేంకటేశ్వర, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంతొమ్మిదవ పాశుర విన్నపం సందర్భంగా 365 ఒత్తులతో దీపాలు వెలిగించారు. వేంకటేశ్వర స్వామిని పచ్చకర్పూరం,సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని లిల్లీపూల దండలతో అలంకరించారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 42, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

అసంపూర్తిగా టీటీడీ సర్కిల్ సుందరీకరణ

» రెండు నెలల కిందట పనులు ప్రారంభం
» అర్ధంతరంగా నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన కూడలి



నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం కూడలి పరిసరాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని పలు కూడళ్లలో స్మార్ట్‌సిటీ నిధులతో కొన్ని నెలల కిందట చేపట్టిన సుందరీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ పనులు పూర్తయితే ఎంతో ఆకర్షణీయంగా మారిపోతాయనుకున్న కూడళ్లు ఇప్పుడు కళావిహీనంగా తయారయ్యాయి. స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను ప్రత్యేకంగా పర్యాటక కేంద్రంగా రూపొందించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. టీటీడీ కూడలిగా పేరొందిన ఈ కూడలిలో అందమైన విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో పాటు ఆధ్యాత్మిక వెల్లివిరిసేలా నాలుగు వైపులా కనిపించేలా భారీ గోవింద నామాలు ఏర్పాటు చేయాలని భావించారు.



గోవింద నామాలతో టీటీడీ కూడలి నమూనా

ఇందుకోసం రూ.1.44 కోట్లతో రెండు నెలల కిందట పనులు మొదలు పెట్టారు. దీంతో టీడీపీ కూడలితో పాటు ఇతర ప్రాంతాలు అందంగా రూపుదిద్దుకుంటాయని అంతా భావించారు. అయితే ఎందుకో తెలియదు గాని ఈ పనులను కొన్ని రోజుల కిందట నిలిపివేశారు. సుందరీకరణ పనుల కోసం తవ్వకాలు చేపట్టి వదిలేయడంతో ఆయా ప్రాంతాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

ట్రాఫిక్ సమస్యల వల్లే..

ప్రధానమైన టీటీడీ సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో పనులు నిలిపి వేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి తారు రోడ్డు బదులు స్టోన్ రోడ్డు నిర్మిస్తారు. ఈ పనుల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దారి మళ్లించడం లేదా, కొన్ని దారులను మూసివేయడం చేయాల్సి ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహించాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్లడంతో పాటు ట్రాఫిక్ పోలీసుల సహాయంతో పనులు మొదలు పెట్టాల్సి ఉందని స్మార్ట్ సిటి విభాగం ఏఈ సుమన్ తెలిపారు. త్వరలోనే పనులు మొదలు పెట్టి 45 రోజుల్లో పూర్తి చేయనున్నట్టు చెప్పారు.

దేశానికి విద్యార్థులు గొప్ప సంపద

» ఎమ్మెల్యే రామకృష్ణబాబు » డా.కృష్ణా కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవి

మద్దిలపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దేశానికి విద్యార్థులు గొప్ప సంపద అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే వేపాడ చిరంజీవితో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకుఅన్ని వసతులు కల్పించే క్రమంలో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకాన్ని 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేశామని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమలు నిలిపి వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలల్లోనే మళ్లీ కళాశాల విద్యార్థుల కోసం ఈ పథకం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకానికి 'ఆకలి' అంటే అర్ధరాత్రి కూడా అన్నం పెట్టిన మహానుబావురాలు, అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ పేరుపెట్టడం అభినందనీయమన్నారు. మహనీయుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల దృష్టి కేవలం చదువుపై మాత్రమే నిలపాలన్నారు. చెడు వ్యసనాల జోలికి వెళ్లవద్దన్నారు. ఇంటర్ రెండేళ్లు కష్టపడితే జీవితాంతం బాగుంటుందన్నారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ శ్రద్ధగా చదివే పిల్లలకే గొప్ప భవిష్యత్తు ఉంటుందని, ఇందులో ధనిక, పేద తరతమ్య బేదాలు ఉండవన్నారు. ఇంటర్ అంటే యవ్వన దశని, ఈ దశలో పౌష్టికాహరం లోపిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం దెబ్బతిని విద్యలో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. అందుకే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారన్నారు. అక్షయపాత్ర నిర్వహకులు దాసు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయంతో జిల్లాలో 53 వేల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు.

అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, ఎన్‌సీసీ అధికారి సన్యాసినాయుడు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు పాల్గొన్న ఎంఈవో బాలామణి, ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు

వాకర్స్ క్లబ్‌కు రూ. పది వేలు బహూకరణ

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్ చేసిన సేవలకు రూ. పదివేలు నగదు బహుమతి లభించింది. ఎంవీపీ కాలనీ అళ్వార్‌దాస్ మైదానంలో వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ టి.రంగారావు క్లబ్ సభ్యులకు నగదు అందించారు. సామాజిక సేవ, ఆరోగ్య శిబిరాల నిర్వహణను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత 'నైపుణ్య' శిక్షణ

ఆరిలోవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీలో గల ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికార కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్టు మహిళా ప్రాంగణాధికారి పి.విమల ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18-36 మధ్య ఉండాలన్నారు. ఈ నెల 12లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నర్సింగ్ కోర్సు(డీజీఏ)కు 10వ తరగతి ఉత్తీర్ణత, రిటైల్ రంగంలో శిక్షణకు 8వ తరగతి ఉతీర్ణత అయి ఉండాలన్నారు. శిక్షణ రెండు నెలల పాటు అందించటంతో పాటు ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ : 62812 61415, 83339 21339లో సంప్రదించాలని తెలిపారు.

సీఎం చంద్రబాబు హామీ నిలుపుకోవాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

సిరిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరినీ యథావిధిగా కొనసాగించడం ద్వారా చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన వార్డు, గ్రామ సచివాలయాల్లో పని చేసిన వలంటీర్లకు ఆమె మద్దతు పలికారు. దీక్షా శిబిరాన్ని రెండో రోజైన శనివారం రమాదేవి సందర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, కార్యదర్శి వి.దీప్తి, కె.రాము, ఆజార్, ఆంజనేయులు పార్వతి, కె.లక్ష్మణ్, ఆదిలక్ష్మి, శ్యామ్, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో శత శాతం టీడీపీ అవాస్తవం

ఆనందపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముచ్చెర్ల పంచాయతీ నూరు శాతం టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం ఆయన వేములవలస గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఏ గ్రామంలోనైనా వంద శాతం ఒకే పార్టీలో ఉండడం అసాధ్యమని తెలిపారు. సభ్యత్వాల పేరుతో టీడీపీ మోసం చేస్తుందని, ముచ్చెర్లలో 1400 మంది సభ్యత్వం తీసుకున్నట్టు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు.



ఇంజనీరింగ్ అధికారులకు సూచలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ సభా వేదిక వరకు జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజు, ఆర్ అండ్ బీ పర్యవేక్షక ఇంజనీరు సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రయాణించే మార్గంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. ఎన్‌ఏడీ వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ సభా ప్రాంగణం వరకు డబుల్ భారీ కేట్లు ఏర్పాటు చేయాలని, అలాగే విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, మార్గం పొడుగునా మొక్కలను ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఇంజనీరింగ్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఈశ్వర్‌కుమార్ తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. 'అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ : ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ నేచురల్ రిసోర్సెస్' అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, విభాగాధిపతి సీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య గానామృతం



తులసిమాలలు, పుష్పాలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మూడో శనివారం వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణలు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వివిధ పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చైతన్య బ్రదర్స్ అన్నమాచార్య గానామృతం భక్తులను ఎంతగానో అలరించాయి. వెంకన్న పాటలతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్

కబ్జాలకు కేరాఫ్ వైసీపీ : కూటమి నేతలు

ఆనందపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అంటేనే భూ కబ్జాలకు చిరునామా అని టీడీపీ మండల సీనియర్ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు గిడిజాలలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. ముచ్చర్ల పంచా యతీ ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి గ్రామాభివృద్ధి కోసం అందరూ టీడీపీ సభ్యత్వం తీసుకుంటే అమర్‌నాథ్ లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు కూడా వైసీపీని వీడి కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, గేట్లు తెరిస్తే వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోతుందన్నారు. వైసీపీ ఎక్కడ ఖాళీ అయిపోతుందోనని అమర్‌నాథ్ పత్రికా సమావేశాలు పెట్టి, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా.. వారిలో మార్పు రాలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, గంద్రెడ్డి రమేశ్, కర్రి శ్రీను, సుభాష్ చంద్రబోస్, కోరాడ వైకుంఠరావు, పాండ్రంకి అప్పలరాజు, లెంక అప్పలనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ : డీఈవో ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్, వేదికపై సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్ తదితరులు

ఆరిలోవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కళ్లు లేకపోయినప్పటికీ పట్టుదలతో బ్రెయిలీ లిపి రూపొందించి తన వంటి ఎందరో అంధుల జీవితాల్లో వెలుగులు నింపిచన లూయిస్ బ్రెయిల్ ఆదర్శప్రాయులని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం తోటగరువు మండల ప్రాథమిక పాఠశాలలో గల భవత కేంద్రంలో లూయిస్ బ్రెయిల్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా.. బండి రాజేశ్వరరావు 50వ వివాహ దినోత్సవ సందర్భంగా సీడబ్ల్యూయూ ఎస్ఎన్ పిల్లలకు 40 దుప్పట్లు, స్టిమ్యులేటింగ్ మిషన్‌ను అందించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, ఎంఈవోలు రవీంద్రబాబు, పి.అనురాధ, పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథం, భవిత ఉపాధ్యాయులు ఎస్.మహాలక్ష్మి, సలీం, సీఆర్పీ అప్పలరాజు పాల్గొన్నారు.

ఫ్రైట్ కంటైనర్‌లో పట్టుకున్న బియ్యం విడుదలకు జేసీ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గత నెల 14న విశాఖ పోర్టు పరిధి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో పట్టుకున్న 259 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన కెర్నల్స్, ఇతర అవశేషాలు లేవని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో నిల్వ చేసిన కాకినాడకు చెందిన బెబో ఇంటర్నేషనల్‌కు 461 టన్నుల బియ్యాన్ని గతనెల తొమ్మిదిన సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఆ తర్వాత బెబో ఇంటర్నేషనల్‌కు చెందిన మరో ఎనిమిది లారీల్లో 259 టన్నుల బియ్యాన్ని ఇదే గోదాముకు తీసుకువచ్చినపుడు వాటి నుంచి శ్యాంపిల్స్ తీసుకుని పౌరసరఫరాల సంస్థ లేబోరేటరీకి పంపామన్నారు. అక్కడ చేపట్టిన పరీక్షల్లో రేషన్ బియ్యం లేనట్టు నిర్ధారణ అయిందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నివేదిక ఇచ్చారన్నారు. దీంతో పట్టుబడిన 259 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని బెబో ఇంటన్నేషనల్‌కు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. అయితే గత నెల తొమ్మిదో తేదీన పట్టుకున్న 461 టన్నుల బియ్యంపై విచారణ కొనసాగుతుందని జేసీ తెలిపారు.

ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

» ఏయూ వీసీకి గెస్ట్ లెక్చరర్స్ వినతి

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఇన్‌కమ్‌ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావును ఆయన అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం వీసీ చాంబర్‌లో కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు.. కరోనా సమయం నుంచి ఏయూలో అతిథి అధ్యాపకులకు సంబంధించి టీడీఎస్ 10 శాతాన్ని కట్ చేస్తున్నారని తెలిపారు. ఆదాయపు పన్ను పరిధిలో లేనప్పటికీ పన్ను విధించడం అన్యాయమన్నారు. ఏయూలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఆదాయపు పన్ను విధించడం లేదని తెలిపారు. కానీ తమ నుంచి వసూలు చేయడం తగదన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని వీసీని కోరారు. వీసీని కలిసిన వారిలో అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్ దేవా, శ్రీను, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శిరీష్, డాక్టర్ వెంకటనాయుడు, డాక్టర్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాక్ సెంటర్‌లో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టీపీవో డిజిటల్ ఇండియా, సెల్ పాయింట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చని, ఎంపికైన అభ్యర్థులకు విశాఖ జిల్లాలోనే ఉద్యోగం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 967670026 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కు అనుసంధానమైన నంబర్‌తో ఉన్న ఫోన్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.40.89 లక్షలు



జగదాంబ కూడలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. డిసెంబరు 23 నుంచి జనవరి 4 వరకు భక్తులు హుండీలో వేసిన కానుకల విలువ మొత్తం రూ.40,89,482 సమకూరినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. బంగారం 96 మిల్లీగ్రాములు, వెండి 275 మిల్లీగ్రాములు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ ఈవో కె.గాయత్రి, కనక మహాలక్ష్మి ఆలయ జేఈవో తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజరు డేవిడ్ రాజు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న వితరణకు రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి అన్న ప్రసాద వితరణ కోసం అమ్మవారి భక్తురాలు ఎస్.వెంకటరమణ కుమారి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో శోభారాణికి అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కనకమహాలక్ష్మికి శనివారం తులసీ దళార్చన సేవలు నిర్వహించారు.

మాధవధారలో 8న ముగ్గుల పోటీలు

మాధవధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్క్‌లో ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు రంగవల్లుల పోటీ నిర్వహించనున్నట్లు మహిళా క్లబ్ సభ్యులు తెలిపారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా చేపడుతున్న ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకునేందుకు క్లబ్ కార్యదర్శి ఫోన్ (94928 73277) నంబరులో సంప్రదించాలని సూచించారు. మాధవధార పరిసర ప్రాంతాలు, మురళీనగర్ నివాసితులు పోటీల్లో పాల్గొనవచ్చని మహిళా క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం కోసం ఎడతెగని నిరీక్షణ



సీతంపేట గణేష్‌నగర్‌లో రేషన్ బండి వెనుక వరుసగా పెట్టిన సంచులు



రేషన్ బియ్యం కోసం వేచి ఉన్న కార్డుదారులు

సీతంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో రేషన్ బియ్యం తీసుకోవడానికి ప్రజలంతా గంటల తరబడి నిరీక్షించవలసిన పరిస్థితి నెలకొంది. ఒకటో తారీఖు వచ్చిందంటే రేషన్ బియ్యం కోసం ఆయా ప్రాంతాల ప్రజలు ఎదురు చూడాల్సిందే. ఆయా రేషన్ డిపోలకు సంబంధించిన కార్డుదారులకు బియ్యం వాహనం ఎక్కడ పెడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీధుల్లో కొంత మంది రేషన్ బియ్యం కొత్త రోడ్డులో ఇస్తున్నారని, అదిగో గుడి వద్ద ఇస్తున్నారని చెప్పడంతో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు రేషన్ బియ్యం కోసం పరుగులు తీస్తుంటారు. బియ్యం పంపిణీ కోసం వాహనం పెట్టి వెళ్తుండటంతో అక్కడకు వచ్చి క్యూ కట్టడం మొదలుపెడుతున్నారు. ఈ సమస్య ప్రతి వార్డు, ప్రతి రేషన్ డిపో పరిధిలో ఉంది. శనివారం సీతంపేట గణేష్‌నగర్ వద్ద రేషన్ బియ్యం కోసం వాహనం వద్ద ఎక్కువ సమయం కార్డుదారులు వేచి ఉన్నారు. సాయంత్రం 5 గంటలు దాటినా వాహనదారుడు రాకపోవడంతో ప్రజలు ఉసూరు మన్నారు. గంటల తరబడి నిరీక్షణ చేసే పరిస్థితుల నుంచి తమకు విముక్తి కల్పించేలా అధికారులు చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం దంపతులకు అపురూప కానుక



మహారాణిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులకు ఓం కారంతో కూడిన వాల్ హ్యాంగర్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ బహూకరించారు. శనివారం సీఎం దంపతులు విశాఖ విచ్చేసిన సందర్భంగా మహ్మద్ నజీర్ వారిని కలిసి చేతి నైపుణ్యంతో ఉన్ని వస్త్రంతో తయారు చేసిన ఓంకారం వాల్ హ్యాంగర్‌ను వారికి అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కానుక బాగుందని వారు నజీర్‌ను ప్రశంసిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నజీర్ ఒక ముస్లింగా ఓం కారాన్ని స్వయంగా తయారు చేయించి ముఖ్యమంత్రికి అందించటం విశేషం.

నజీర్ అందజేసిన ఓంకారం హ్యాంగర్‌ను ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం దంపతులు

'వీసీ పోస్టు దళితునికి కేటాయించాలి'

సీతమ్మధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రయూనివర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టును దళిత సామాజికవర్గ ప్రొఫెసర్‌కు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ కోరారు. రామా టాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏయూ వీసీ పోస్ట్ దళితులకు ఇచ్చి ఇరవై సంవత్సరాలైందని, సమర్థులైన దళితులు ఎంతో మంది ఉన్నా ఎందుకో వారిని గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో దళితుల ఆకాంక్షలకు అనుగుణంగా వీసీ పోస్ట్ ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఇంచార్జ్‌ల పాలన జరుగుతోందని, వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి నాలుగు నెలలైందన్నారు. ఉన్నత విద్య ఛైర్మన్ పోస్ట్ భర్తీ కాలేదన్నారు. వీటి భర్తీ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు చక్కదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నాయకులు గుబ్బల రాంబాబు, మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, సరస్వతి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ చాంపియన్స్ సాయిగణపతి, భీమిలి జట్లు

కంచరపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 27వ రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 24 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శనివారం బహుమతి ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వర్రావు హాజరై విజేతలకు బహుమతులు, మెమెంటోలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ .గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటల్లో పాల్గొనడమే ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక, మానసిన ఉల్లాసానికి, క్రమశిక్షణకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్స్ బాలుర విభాగంలో సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల,(గిరిజాల), బాలికల విభాగంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వారు నిలిచారు. వ్యక్తిగత చాంపియన్లుగా ఎస్.ఈశ్వర్ వర్ధన్, ఎస్.మల్లేశ్వరి (సాయిగణపతి కళాశాల) ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. నారాయణరావు మాట్లాడుతూ మీట్‌లో పాల్గొన్న 24 కళాశాలల విద్యార్థులను అభినందించారు. మీట్‌ను విజయవంతం చేసిన పీడీలను అభినందించారు. విద్యార్థులను ఉత్తేజపరిచి, వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన సీనియర్ అధ్యాపకులు సరళాబాయి, మౌనికలను ప్రిన్సిపాల్ ప్రశంసించారు.



బాలికల చాంపియన్ భీమిలి జట్టుతో అతిథులు



బాలుర చాంపియన్‌గా నిలిచిన గిరిజాల జట్టు సభ్యులు

అంధులకు మార్గదర్శి లూయి బ్రెయిలీ



బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న ఎంఈవో బాలామణి ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరస తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలో విభిన్న ప్రతిభావంతుల పాఠశాల భవిత కేంద్రంలో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీతమ్మధార ఎంఈవో బాలామణి, గౌరవ అతిథిగా జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రెయిలీ ఫ్రెంచ్ విద్యావేత్త, సృష్టికర్త అని చెప్పారు. ప్రపంచ అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడని పేర్కొన్నారు. 1809 జనవరి 4న పారిస్ సమీపంలోని క్రూవ్రా గ్రామంలో జన్మించారన్నారు. బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయి తన నాల్గో ఏట పూర్తిగా అంధుడయ్యారన్నారు. అయినా నిరుత్సాహపడకుండా బ్రెయిలీ లిపిని రూపొందించారన్నారు. అంధులు, విభిన్న ప్రతిభావంతులు ఆయన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, భవిత కేంద్రం ఉపాధ్యాయినులు శారద, జగదాంబ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10న పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ పారా స్పోర్ట్సు అసోసియేషన్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్తంగా ఈ నెల 10న పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ మీట్ కమ్ రాష్ట్ర స్థాయి పోటీలకు జట్టు ఎంపికలు జరుగుతాయని సంఘం ప్రతినిధులు డాక్టర్ శీతల్ మదన్, ఆవల రమేష్, రామస్వామి తెలిపారు. ఒక్కరోజు జరిగే ఈ టోర్నీలో రన్స్, త్రో, జంప్ ఈవెంట్లలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఔత్సాహిక పారా అథ్లెట్లు ఈ నెల 8లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93901 31777, 96524 58901 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వేస్టేషన్ బస్సు స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (60) డిసెంబరు 5న అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడ్ని కేజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరుగా సంప్రదించాలని లేదా సీఐ ఫోను నెంబరు (94407 96012)కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కళా రంగానికి మహ్మద్‌ఖాన్ సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, చిత్రంలో ఇతర కళాకారులు

డాబాగార్డెన్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న గీత్ సంగీత్ అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్ సేవలు ప్రశంసనీయమని సెంచూరియన్ విశ్వవిశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం సాయంత్రం గీత్ సంగీత్ ఆధ్వర్యంలో 'శశి వదనే' సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరొందిన విశాఖలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఏర్పాటైన సంగీత విభావరిలో సాయి, రంజిత పాడిన అల్లాటప్పా గోంగూరమ్మో..యాద్ ఆ రహా హేయ్ తేరా..ప్యార్...తదితర గీతాలను సుప్రీం శేఖర్, జ్యోతి, జోసెఫ్, నీలిమ రాణి, రమేష్ పట్నాయక్, అంబికా ఆలపించారు. కళా సంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఫణిస్వామి, చీరాల ఉషా, భయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుపాశాల్లా కేబుల్ వైర్లు



ఏఎంజీ ఆస్పత్రి పక్క రోడ్డులో ఇలా..



నక్కవానిపాలెంలో వేలాడుతున్న కేబుల్

సీతమ్మధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో కేబుల్ వైర్లు, నెట్ వైర్లు, వాటికి సంబంధించిన బాక్సులు కిందికి వేలాడుతూ బాటసారులు, వాహనదారులను తాకేలా ప్రమాదకరంగా ఉన్నాయి. నక్కవానిపాలెంలోని ఏఎంజీ ఆసుపత్రి వెనుక రోడ్డులో కేబుల్ వైర్లు, బాక్స్ కిందికి వేలాడుతూ రోడ్డు మధ్యలో ఉన్నాయి. పాదచారులు తప్పించుకుంటున్నా వాహనదారుల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. నక్కవానిపాలెంలోని పలు సీసీ రోడ్లలోనూ ఇదే తంతు. పలు విద్యుత్ స్తంభాల వద్ద కేబుల్ వైర్లు, పలు నెట్‌వర్క్‌లకు సంబంధించిన తీగలు కిందికి వేలాడుతూ ఉన్నాయి. రాత్రివేళ వాహనదారుల మెడకు తగులుతున్నాయి. వారు భయంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పగటి సమయంలో తలవంచుకొని వెళ్తున్నా, రాత్రి పూట మాత్రం ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. వేలాడుతున్న వైర్లను జీవీఎంసీ అధికారులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాని సభకు జన సమీకరణపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

నిర్మిస్తున్నారు. ఒక దాంట్లో 60 వేలు, మరో దాంట్లో 40 వేలు కుర్చీలు వేస్తున్నారు. ఇంకా రెండు హాళ్లలో కలిపి రెండు వేల మందికి సరిపడేలా 50 గ్యాలరీలు ఏర్పాటుచేస్తున్నారు. మిగిలిన వారు సభా ప్రాంగణం బయట ఉంటారు. వీరంతా ప్రధాని, ఇతర ప్రముఖల ప్రసంగాలు వినేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి సభా వేదిక వరకు ప్రధాని రోడ్‌షోలో 60 నుంచి 70 వేల మంది పాల్గొనేలా జనాలను సమీకరిస్తున్నారు. సభ, రోడ్‌షోకు జనాలను తరలించడానికి ఆర్టీసీ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన రెండు వేల బస్సులు తీసుకుంటున్నారు. జనాల తరలింపునకు మొత్తం 300 పాయింట్లు గుర్తించారు. బస్సులు ఇటు మద్దిలపాలెం, అటు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో జనాలను దించేసి ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాలకు వెళతాయి. ప్రతి పార్కింగ్ కేంద్రానికి డిప్యూటీ కలెక్టర్/జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సభ ముగిసిన తరువాత జనాలు మద్దిలపాలెం, త్రీటౌన్ జంక్షన్‌లకు వచ్చి బస్సుల్లో ఇళ్లకు వెళ్లేలా ముందుగానే వారికి సమాచారం ఇవ్వనున్నారు.

మధ్యాహ్నం పులిహోర, రాత్రికి వెజ్ బిర్యానీ

ప్రధాని సభకు హాజరయ్యే వారికి మధ్యాహ్నం పులిహోర, పెరుగు చట్నీ, వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాక్‌తో కూడిన ప్యాకెట్ అందజేస్తారు. రాత్రికి వెజ్ బిర్యానీ, పెరుగుచట్నీ, వాటర్ బాటిల్‌తో మరో ప్యాకెట్ ఇవ్వాలని నిర్ణయించారు. జనాన్ని తరలించేందుకు 300 పాయింట్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఇచ్చేందుకు 1.2 లక్షల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. సభ అనంతరం అనకాపల్లి జిల్లాకు చెందిన వారికి 40 వేల మందికి, విజయనగరం/శ్రీకాకుళం వెళ్లే 20 వేల మందికి, జిల్లాలో నాలుగు గ్రామీణ మండలాలకు చెందిన 10 వేల మందికి పంపిణీ చేసేందుకు వెజ్ బిర్యానీ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధాని రోడ్ షోలో పాల్గొనే 60 నుంచి 70 వేల మందికి స్నాక్స్, వాటర్ బాటిల్ అందిస్తారు. జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల పౌర సరఫరాల అధికారులు భాస్కరరావు, సూర్యప్రకాశ్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, ఇతర అధికారులు ఆహారం తయారీ, పంపిణీ బాధ్యతలు పర్యవేక్షించనున్నారు.

కళ్ల ముందు కదనరంగం

... 5వ పేజీ తరువాయి

అతిథులు ఆసీనులైన వేదిక వద్ద దిగి శభాష్ అనిపించుకున్నారు. సముద్రంలో కదులుతున్న యుద్ధ నౌకలపై హెలికాప్టర్లను సురక్షితంగా దించడం, తిరిగి టేకాఫ్ తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అటువంటి సాహసాన్ని అలవోకగా చేసి చూపించారు. ఐఎన్ఎస్ సహ్యాద్రి నౌకపైకి చేతక్ హెలికాప్టర్‌ను, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ నౌకలపైకి అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, స్టెల్త్ ఫ్రిగేట్ నౌక ఐఎన్ఎస్ సాత్పురాపైకి సీ కింగ్ హెలికాప్టర్లను దించి పైలట్లు నైపుణ్యాన్ని చాటారు.

సముద్రంలో చిక్కుకుపోయిన వారిని డబుల్ ఇంజన్ కలిగిన అడ్వాన్స్‌డ్ ఏఎల్ హెలికాప్టర్‌లో వచ్చి రక్షించిన విధానం ఎంత కష్టతరమైనదో అందరికీ అర్థమైంది. సముద్రంలో బారులు తీరిన యుద్ధనౌకలు ఐఎన్ఎస్ ముంబై, కిల్తాన్, కవరత్తిల నుంచి సబ్‌మెరైన్‌లను మట్టికరిపించే రాకెట్లను ప్రయోగించి ఆహా అనిపించారు. చివరిగా నాలుగు చేతక్ హెలికాప్టర్లు, ఒక సీ కింగ్ హెలికాప్టర్, మూడు ఏఎల్ హెలికాప్టర్లు, నాలుగు డార్నియర్ విమానాలు, ఒక నిఘా విమానం పీ8ఐ, ఏడు హాక్ జెట్ విమానాలు ఒక బృందం తరువాత మరొక బృందం వేదిక ముందుగా వచ్చి అతిథుల ముందు నిర్వహించిన ఫ్లై పాస్ట్ కనువిందు చేసింది. సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ వేల అల్లంత దూరం నుంచి అందరికీ హాయ్ చెప్పి కనుమరుగైంది. ప్రదర్శన అనంతరం ఐఎన్ఎస్ సావిత్రి యుద్ధనౌక నుంచి చేసిన లేజర్ షో అలరించింది. డ్రోన్లతో ఆకాశంలో ఆవిష్కరించిన నమూనాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. నేవీ బ్యాండ్ బీటింట్ రిట్రీట్ ప్రదర్శన, సీ క్యాడెట్ల నృత్యం, సెయిలర్ల కంటిన్యువిటీ డ్రిల్, హార్న్ పైప్ డ్యాన్సు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు హాజరయ్యారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూపాంతరం చెందుతుందన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఒప్పందం చేసుకుందని, ఇప్పటికే టీసీఎస్ భవనం కూడా ఎంపిక చేసుకుందన్నారు. మరిన్ని ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 8న ప్రధాని విశాఖలో రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తున్నామన్నారు. మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, త్వరలో విశాఖకు మెట్రో రైలు కూడా వస్తుందన్నారు. నగరంలో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియంతో పాటు టీయూ-142 కూడా తామే ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరొకటి యుహెచ్-3హెచ్ మ్యూజియం వస్తుందన్నారు. రాష్ట్రంలో వేయి కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉందని, మౌలిక వసతులు కల్పించినట్టయితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సంపద పెరుగుతుందన్నారు. గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాదే అనకాపల్లి జిల్లాకు తీసుకువస్తామని, వచ్చే ఏడాది విశాఖపట్నం తెస్తామని చంద్రబాబు ప్రకటించారు.

దేశ రక్షణలో కీలకంగా ఉండే నౌకాదళం రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కూడా అదే చొరవతో ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నదని ప్రశంసించారు. హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు తాను పది రోజులు ఇక్కడే ఉండి అన్నీ సరిచేశానని, ఆ సమయంలో నేవీ అందించిన సహకారం మరువలేనిదన్నారు. విశాఖలో తూర్పు నౌకాదళం ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తుఫాన్లు వచ్చిన ప్రతిసారి మత్స్యకారులను రక్షించడంలో కీలక పాత్ర వహిస్తుందన్నారు.

చిన్నపిల్లలు తప్పిపోతే ఆర్ఎఫ్ఐడీ ద్వారా గుర్తింపు

... 5వ పేజీ తరువాయి

నగర పోలీసులు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) తీసుకువచ్చారు. బీచ్‌రోడ్డులో శనివారం జరిగిన నేవీ విన్యాసాలు సందర్భంగా తొలిసారి దీనిని అమలుచేశారు. నేవీ విన్యాసాలను వీక్షించేందుకు తల్లిదండ్రులతో కలిసి బీచ్‌కు వచ్చిన ఐదేళ్లలోపు పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, ఫోన్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను ఒక క్యూఆర్‌కోడ్ రూపంలో ట్యాగ్‌పై ముద్రించారు. ఆ ట్యాగ్‌లను పిల్లల చేతికి అతికించారు. ఎవరైనా పిల్లలు తప్పిపోయినప్పుడు వారి వివరాలను చెప్పలేరు కాబట్టి, తమ సెల్‌ఫోన్ ద్వారా చేతికి ఉన్న ట్యాగ్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మొత్తం సమాచారం తెలుసుకోవచ్చు. వాటి ఆధారంగా పిల్లలను వారి తల్లిదండ్రులకు వెంటనే అప్పగించేందుకు వీలుంటుంది. నేవీ విన్యాసాల సందర్భంగా శనివారం బీచ్‌కు వచ్చిన రెండు వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

... 5వ పేజీ తరువాయి

మొత్తం 5,600 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిలో తొలిరోజు 4,800 మంది భోజనం చేశారు. పది జూనియర్ కళాశాలలు, నాలుగు హైస్కూల్ ప్లస్‌లకు అక్షయపాత్ర భోజనం అందించగా, మరో ఐదు హైస్కూల్ ప్లస్‌లలో అక్కడ ఉన్నత పాఠశాలల్లో పిల్లలకు భోజనం వండే స్వయం శక్తి సంఘాలే సిద్ధం చేశాయి.

నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన పోషకాహారం లభించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కాగా, అగనంపూడి జూనియర్ కళాశాలలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నగరంలోని కృష్ణా జూనియర్ కళాశాలలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పథకాన్ని ప్రారంభించారు. మిగిలినచోట్ల స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇంటర్ విద్యాశాఖ అధికారులు పథకం ప్రారంభించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో భోజనం పథకం ప్రారంభమైందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

అసంపూర్తిగా టీటీడీ సర్కిల్ సుందరీకరణ

- రెండు నెలల కిందట పనులు ప్రారంభం
- అర్ధంతరంగా నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన కూడలి

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని పలు కూడళ్లలో స్మార్ట్‌సిటీ నిధులతో కొన్ని నెలల కిందట చేపట్టిన సుందరీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ పనులు పూర్తయితే ఎంతో ఆకర్షణీయంగా మారిపోతాయనుకున్న కూడళ్లు ఇప్పుడు కళావిహీనంగా తయారయ్యాయి. స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను ప్రత్యేకంగా పర్యాటక కేంద్రంగా రూపొందించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. టీటీడీ కూడలిగా పేరొందిన ఈ కూడలిలో అందమైన విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో పాటు ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా నాలుగు వైపులా కనిపించేలా భారీ గోవింద నామాలు ఏర్పాటు చేయాలని భావించారు.



నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం కూడలి పరిసరాలు



గోవింద నామాలతో టీటీడీ కూడలి నమూనా

ఇందుకోసం రూ.1.44 కోట్లతో రెండు నెలల కిందట పనులు మొదలు పెట్టారు. దీంతో టీడీపీ కూడలితో పాటు ఇతర ప్రాంతాలు అందంగా రూపుదిద్దుకుంటాయని అంతా భావించారు. అయితే ఎందుకో తెలియదు గాని ఈ పనులను కొన్ని రోజుల కిందట నిలిపివేశారు. సుందరీకరణ పనుల కోసం తవ్వకాలు చేపట్టి వదిలేయడంతో ఆయా ప్రాంతాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

ట్రాఫిక్ సమస్యల వల్లే..

ప్రధానమైన టీటీడీ సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో పనులు నిలిపి వేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి తారు రోడ్డు బదులు స్టోన్ రోడ్డు నిర్మిస్తారు. ఈ పనుల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దారి మళ్లించడం లేదా, కొన్ని దారులను మూసివేయడం చేయాల్సి ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహించాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్లడంతో పాటు ట్రాఫిక్ పోలీసుల సహాయంతో పనులు మొదలు పెట్టాల్సి ఉందని స్మార్ట్ సిటి విభాగం ఏఈ సుమన్ తెలిపారు. త్వరలోనే పనులు మొదలు పెట్టి 45 రోజుల్లో పూర్తి చేయనున్నట్టు చెప్పారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



లిల్లీ పూలతో అలంకృతుడైన సుబ్రహ్మణ్య స్వామి

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో గల శ్రీవేంకటేశ్వర, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంతొమ్మిదవ పాశుర విన్నపం సందర్భంగా 365 ఒత్తులతో దీపాలు వెలిగించారు. వేంకటేశ్వర స్వామిని పచ్చకర్పూరం,సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని లిల్లీపూల దండలతో అలంకరించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 42, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 60, కీర దోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు (బ్యాగ్)

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

దేశానికి విద్యార్థులు గొప్ప సంపద

- ఎమ్మెల్యే రామకృష్ణబాబు
- డా.కృష్ణా కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవి

మద్దిలపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దేశానికి విద్యార్థులు గొప్ప సంపద అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే వేపాడ చిరంజీవితో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకుఅన్ని వసతులు కల్పించే క్రమంలో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకాన్ని 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేశామని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమలు నిలిపి వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలల్లోనే మళ్లీ కళాశాల విద్యార్థుల కోసం ఈ పథకం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకానికి 'ఆకలి' అంటే అర్ధరాత్రి కూడా అన్నం పెట్టిన మహానుబావురాలు, అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ పేరుపెట్టడం అభినందనీయమన్నారు. మహనీయుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల దృష్టి కేవలం చదువుపై మాత్రమే నిలపాలన్నారు. చెడు వ్యసనాల జోలికి వెళ్లవద్దన్నారు. ఇంటర్ రెండేళ్లు కష్టపడితే జీవితాంతం బాగుంటుందన్నారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ శ్రద్ధగా చదివే పిల్లలకే గొప్ప భవిష్యత్తు ఉంటుందని, ఇందులో ధనిక, పేద తరతమ్య భేదాలు ఉండవన్నారు. ఇంటర్ అంటే యవ్వన దశని, ఈ దశలో పౌష్టికాహారం లోపిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం దెబ్బతిని విద్యలో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. అందుకే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారన్నారు. అక్షయపాత్ర నిర్వహకులు దాసు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయంతో జిల్లాలో 53 వేల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు.

అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, ఎన్‌సీసీ అధికారి సన్యాసినాయుడు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు పాల్గొన్న ఎంఈవో బాలామణి, ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు

వాకర్స్ క్లబ్‌కు రూ. పది వేలు బహూకరణ

ఎంవీపీ కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్ చేసిన సేవలకు రూ. పదివేలు నగదు బహుమతి లభించింది. ఎంవీపీ కాలనీ అల్వార్‌దాస్ మైదానంలో వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ టి.రంగారావు క్లబ్ సభ్యులకు నగదు అందించారు. సామాజిక సేవ, ఆరోగ్య శిబిరాల నిర్వహణను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత 'నైపుణ్య' శిక్షణ

ఆరిలోవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీలో గల ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికార కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్టు మహిళా ప్రాంగణాధికారి పి.విమల ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18-36 మధ్య ఉండాలన్నారు. ఈ నెల 12లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నర్సింగ్ కోర్సు(డీజీఏ)కు 10వ తరగతి ఉత్తీర్ణత, రిటైల్ రంగంలో శిక్షణకు 8వ తరగతి ఉతీర్ణత అయి ఉండాలన్నారు. శిక్షణ రెండు నెలల పాటు అందించటంతో పాటు ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ : 62812 61415, 83339 21339లో సంప్రదించాలని తెలిపారు.

సీఎం చంద్రబాబు హామీ నిలుపుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

సిరిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరినీ యథావిధిగా కొనసాగించడం ద్వారా చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన వార్డు, గ్రామ సచివాలయాల్లో పని చేసిన వలంటీర్లకు ఆమె మద్దతు పలికారు. దీక్షా శిబిరాన్ని రెండో రోజైన శనివారం రమాదేవి సందర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, కార్యదర్శి వి.దీప్తి, కె.రాము, ఆజార్, ఆంజనేయులు పార్వతి, కె.లక్ష్మణ్, ఆదిలక్ష్మి, శ్యామ్, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో శత శాతం టీడీపీ అవాస్తవం

ఆనందపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముచ్చెర్ల పంచాయతీ నూరు శాతం టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం ఆయన వేములవలస గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఏ గ్రామంలోనైనా వంద శాతం ఒకే పార్టీలో ఉండడం అసాధ్యమని తెలిపారు. సభ్యత్వాల పేరుతో టీడీపీ మోసం చేస్తుందని, ముచ్చెర్లలో 1400 మంది సభ్యత్వం తీసుకున్నట్టు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు.



ఇంజనీరింగ్ అధికారులకు సూచలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఎన్ఏడీ జంక్షన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ సభా వేదిక వరకు జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజు, ఆర్ అండ్ బీ పర్యవేక్షక ఇంజనీరు సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రయాణించే మార్గంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. ఎన్ఏడీ వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ సభా ప్రాంగణం వరకు డబుల్ బారీ కేట్లు ఏర్పాటు చేయాలని, అలాగే విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, మార్గం పొడుగునా మొక్కలను ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఇంజనీరింగ్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయ రావు, అకడమిక్ డీన్ ఈశ్వర్‌కుమార్ తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. 'అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ : ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ నేచురల్ రిసోర్సెస్' అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, విభాగాధిపతి సీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య గానామృతం



తులసిమాలలు, పుష్పాలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మూడో శనివారం వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణలు భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వివిధ పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చైతన్య బ్రదర్స్ అన్నమాచార్య గానామృతం భక్తులను ఎంతగానో అలరించాయి. వెంకన్న పాటలతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్

కబ్జాలకు కేరాఫ్ వైసీపీ : కూటమి నేతలు

ఆనందపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అంటేనే భూ కబ్జాలకు చిరునామా అని టీడీపీ మండల సీనియర్ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు గిడిజాలలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. ముచ్చర్ల పంచా యతీ ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి గ్రామాభివృద్ధి కోసం అందరూ టీడీపీ సభ్యత్వం తీసుకుంటే అమర్‌నాథ్ లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు కూడా వైసీపీని వీడి కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, గేట్లు తెరిస్తే వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోతుందన్నారు. వైసీపీ ఎక్కడ ఖాళీ అయిపోతుందోనని అమర్‌నాథ్ పత్రికా సమావేశాలు పెట్టి, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా.. వారిలో మార్పు రాలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు తాట్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, గంగ్రెడ్డి రమేశ్, కర్రి శ్రీను, సుభాష్ చంద్రబోస్, కోరాడ వైకుంఠరావు, పాండ్రంకి అప్పలరాజు, లెంక అప్పలనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ : డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కళ్లు లేకపోయినప్పటికీ పట్టుదలతో బ్రెయిలీ లిపి రూపొందించి తన వంటి ఎందరో అంధుల జీవితాల్లో వెలుగులు నింపిచన లూయిస్ బ్రెయిల్ ఆదర్శప్రాయులని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం తోటగరువు మండల ప్రాథమిక పాఠశాలలో గల భవత కేంద్రంలో లూయిస్ బ్రెయిల్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా.. బండి రాజేశ్వరరావు 50వ వివాహ దినోత్సవ సందర్భంగా సీడబ్ల్యూయూ ఎస్ఎన్ పిల్లలకు 40 దుప్పట్లు, స్టిమ్యులేటింగ్ మిషన్‌ను అందించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, ఎంఈవోలు రవీంద్రబాబు, పి.అనురాధ, పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, భవిత ఉపాధ్యాయులు ఎస్.మహాలక్ష్మి, సలీం, సీఆర్పీ అప్పలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్, వేదికపై సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్ తదితరులు

ఫ్రైట్ కంటైనర్‌లో పట్టుకున్న బియ్యం విడుదలకు జేసీ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గత నెల 14న విశాఖ పోర్టు పరిధి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో పట్టుకున్న 259 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన కెర్నల్స్ ఇతర అవశేషాలు లేవని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో నిల్వ చేసిన కాకినాడకు చెందిన బెబో ఇంటర్నేషనల్‌కు 461 టన్నుల బియ్యాన్ని గతనెల తొమ్మిదిన సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఆ తర్వాత బెబో ఇంటర్నేషనల్‌కు చెందిన మరో ఎనిమిది లారీల్లో 259 టన్నుల బియ్యాన్ని ఇదే గోదాముకు తీసుకువచ్చినపుడు వాటి నుంచి శ్యాంపిల్స్ తీసుకుని పౌరసరఫరాల సంస్థ లేబోరేటరీకి పంపామన్నారు. అక్కడ చేపట్టిన పరీక్షల్లో రేషన్ బియ్యం లేనట్టు నిర్ధారణ అయిందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నివేదిక ఇచ్చారన్నారు. దీంతో పట్టుబడిన 259 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని బెబో ఇంటర్నేషనల్‌కు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. అయితే గత నెల తొమ్మిదో తేదీన పట్టుకున్న 461 టన్నుల బియ్యంపై విచారణ కొనసాగుతుందని జేసీ తెలిపారు.

ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

- ఏయూ వీసీకి గెస్ట్ లెక్చరర్స్ వినతి

వెంకోజీపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఇన్‌కమ్‌ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావును ఆయన అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం వీసీ చాంబర్‌లో కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు.. కరోనా సమయం నుంచి ఏయూలో అతిథి అధ్యాపకులకు సంబంధించి టీడీఎస్ 10 శాతాన్ని కట్ చేస్తున్నారని తెలిపారు. ఆదాయపు పన్ను పరిధిలో లేనప్పటికీ పన్ను విధించడం అన్యాయమన్నారు. ఏయూలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఆదాయపు పన్ను విధించడం లేదని తెలిపారు. కానీ తమ నుంచి వసూలు చేయడం తగదన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని వీసీని కోరారు. వీసీని కలిసిన వారిలో అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్ దేవా, శ్రీను, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శిరీష్, డాక్టర్ వెంకటనాయుడు, డాక్టర్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాక్ సెంటర్‌లో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టీపీవో డిజిటల్ ఇండియా, సెల్ పాయింట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చని, ఎంపికైన అభ్యర్థులకు విశాఖ జిల్లాలోనే ఉద్యోగం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 967670026 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కు అనుసంధానమైన నంబర్‌తో ఉన్న ఫోన్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.40.89 లక్షలు



జగదాంబ కూడలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. డిసెంబరు 23 నుంచి జనవరి 4 వరకు భక్తులు హుండీలో వేసిన కానుకల విలువ మొత్తం రూ.40,89,482 సమకూరినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. బంగారం 96 మిల్లీగ్రాములు, వెండి 275 మిల్లీగ్రాములు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ ఈవో కె.గాయత్రి, కనక మహాలక్ష్మి ఆలయ జేఈవో తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజరు డేవిడ్ రాజు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న వితరణకు రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి అన్న ప్రసాద వితరణ కోసం అమ్మవారి భక్తురాలు ఎస్.వెంకటరమణ కుమారి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో శోభారాణికి అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కనకమహాలక్ష్మికి శనివారం తులసీ దళార్చన సేవలు నిర్వహించారు.

మాధవధారలో 8నముగ్గుల పోటీలు

మాధవధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్క్‌లో ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు రంగవల్లుల పోటీ నిర్వహించనున్నట్లు మహిళా క్లబ్ సభ్యులు తెలిపారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా చేపడుతున్న ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకునేందుకు క్లబ్ కార్యదర్శి ఫోన్ (94928 73277) నంబరులో సంప్రదించాలని సూచించారు. మాధవధార పరిసర ప్రాంతాలు, మురళీనగర్ నివాసితులు పోటీల్లో పాల్గొనవచ్చని మహిళా క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం కోసం ఎడతెగని నిరీక్షణ



సీతంపేట గణేష్‌నగర్‌లో రేషన్ బండి వెనుక వరుసగా పెట్టిన సంచులు



రేషన్ బియ్యం కోసం వేచి ఉన్న కార్డుదారులు

సీతంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో రేషన్ బియ్యం తీసుకోవడానికి ప్రజలంతా గంటల తరబడి నిరీక్షించవలసిన పరిస్థితి నెలకొంది. ఒకటో తారీఖు వచ్చిందంటే రేషన్ బియ్యం కోసం ఆయా ప్రాంతాల ప్రజలు ఎదురు చూడాల్సిందే. ఆయా రేషన్ డిపోలకు సంబంధించిన కార్డుదారులకు బియ్యం వాహనం ఎక్కడ పెడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీధుల్లో కొంత మంది రేషన్ బియ్యం కొత్త రోడ్డులో ఇస్తున్నారని, అదిగో గుడి వద్ద ఇస్తున్నారని చెప్పడంతో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు రేషన్ బియ్యం కోసం పరుగులు తీస్తుంటారు. బియ్యం పంపిణీ కోసం వాహనం పెట్టి వెళ్తుండటంతో అక్కడకు వచ్చి క్యూ కట్టడం మొదలుపెడుతున్నారు. ఈ సమస్య ప్రతి వార్డు, ప్రతి రేషన్ డిపో పరిధిలో ఉంది. శనివారం సీతంపేట గణేష్‌నగర్ వద్ద రేషన్ బియ్యం కోసం వాహనం వద్ద ఎక్కువ సమయం కార్డుదారులు వేచి ఉన్నారు. సాయంత్రం 5 గంటలు దాటినా వాహనదారుడు రాకపోవడంతో ప్రజలు ఉసూరు మన్నారు. గంటల తరబడి నిరీక్షణ చేసే పరిస్థితుల నుంచి తమకు విముక్తి కల్పించేలా అధికారులు చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం దంపతులకు అపురూప కానుక



మహారాణిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులకు ఓం కారంతో కూడిన వాల్ హ్యాంగర్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ బహూకరించారు. శనివారం సీఎం దంపతులు విశాఖ విచ్చేసిన సందర్భంగా మహ్మద్ నజీర్ వారిని కలిసి చేతి నైపుణ్యంతో ఉన్ని వస్త్రంతో తయారు చేసిన ఓంకారం వాల్ హ్యాంగర్‌ను వారికి అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కానుక బాగుందని వారు నజీర్‌ను ప్రశంసిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నజీర్ ఒక ముస్లింగా ఓం కారాన్ని స్వయంగా తయారు చేయించి ముఖ్యమంత్రికి అందించటం విశేషం.

నజీర్ అందజేసిన ఓంకారం హ్యాంగర్‌ను ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం దంపతులు

'వీసీ పోస్టు దళితునికి కేటాయించాలి'

సీతమ్మధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పోస్టును దళిత సామాజికవర్గ ప్రొఫెసర్‌కు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ కోరారు. రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏయూ వీసీ పోస్ట్ దళితులకు ఇచ్చి ఇరవై సంవత్సరాలైందని, సమర్థులైన దళితులు ఎంతో మంది ఉన్నా ఎందుకో వారిని గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో దళితుల ఆకాంక్షలకు అనుగుణంగా వీసీ పోస్ట్ ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఇంచార్జ్‌ల పాలన జరుగుతోందని, వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి నాలుగు నెలలైందన్నారు. ఉన్నత విద్య ఛైర్మన్ పోస్ట్ భర్తీ కాలేదన్నారు. వీటి భర్తీ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు చక్కదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నాయకులు గుబ్బల రాంబాబు, మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, సరస్వతి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఛాంపియన్స్ సాయిగణపతి, భీమిలి జట్లు



బాలికల చాంపియన్ భీమిలి జట్టుతో అతిథులు



బాలుర చాంపియన్‌గా నిలిచిన గిరిజాల జట్టు సభ్యులు

కంచరపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 27వ రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 24 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శనివారం బహుమతి ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వర్రావు హాజరై విజేతలకు బహుమతులు, మెమెంటోలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటల్లో పాల్గొనడమే ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక, మానసిన ఉల్లాసానికి, క్రమశిక్షణకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్స్ బాలుర విభాగంలో సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల,(గిరిజాల), బాలికల విభాగంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వారు నిలిచారు. వ్యక్తిగత ఛాంపియన్లుగా ఎన్.ఈశ్వర్ వర్ధన్, ఎస్.మల్లేశ్వరి (సాయిగణపతి కళాశాల) ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. నారాయణరావు మాట్లాడుతూ మీట్‌లో పాల్గొన్న 24 కళాశాలల విద్యార్థులను అభినందించారు. మీట్‌ను విజయవంతం చేసిన పీడీలను అభినందించారు. విద్యార్థులను ఉత్తేజపరిచి, వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన సీనియర్ అధ్యాపకులు సరళాబాయి, మౌనికలను ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

అంధులకు మార్గదర్శి లూయి బ్రెయిలీ



బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న ఎంఈవో బాలామణి ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరస తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలో విభిన్న ప్రతిభావంతుల పాఠశాల భవిత కేంద్రంలో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీతమ్మధార ఎంఈవో బాలామణి, గౌరవ అతిథిగా జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రెయిలీ ఫ్రెంచ్ విద్యావేత్త, సృష్టికర్త అని చెప్పారు. ప్రపంచ అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడని పేర్కొన్నారు. 1809 జనవరి 4న పారిస్ సమీపంలోని క్రూవా గ్రామంలో జన్మించారన్నారు. బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయి తన నాల్గో ఏట పూర్తిగా అంధుడయ్యారన్నారు. అయినా నిరుత్సాహపడకుండా బ్రెయిలీ లిపిని రూపొందించారన్నారు. అంధులు, విభిన్న ప్రతిభావంతులు ఆయన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, భవిత కేంద్రం ఉపాధ్యాయినులు శారద, జగదాంబ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10న పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ పారా స్పోర్ట్సు అసోసియేషన్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్తంగా ఈ నెల 10న పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ మీట్ కమ్ రాష్ట్ర స్థాయి పోటీలకు జట్టు ఎంపికలు జరుగుతాయని సంఘం ప్రతినిధులు డాక్టర్ శీతల్ మదన్, ఆవల రమేష్, రామస్వామి తెలిపారు. ఒక్కరోజు జరిగే ఈ టోర్నీలో రన్స్, త్రో, జంప్ ఈవెంట్లలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఔత్సాహిక పారా అథ్లెట్లు ఈ నెల 8లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93901 31777, 96524 58901 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వేస్టేషన్ బస్సు స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (60) డిసెంబరు 5న అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడ్ని కేజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరుగా సంప్రదించాలని లేదా సీఐ ఫోను నెంబరు (94407 96012)కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కళా రంగానికి మహ్మద్‌ఖాన్ సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, చిత్రంలో ఇతర కళాకారులు

డాబాగార్డెన్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న గీత్ సంగీత్ అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్ సేవలు ప్రశంసనీయమని సెంచూరియన్ విశ్వవిశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం సాయంత్రం గీత్ సంగీత్ ఆధ్వర్యంలో 'శశి వదనే' సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరొందిన విశాఖలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఏర్పాటైన సంగీత విభావరిలో సాయి, రంజిత పాడిన అల్లాటప్పా గోంగూరమ్మో..యాద్ ఆ రహా హేయ్ తేరా..ప్యార్..తదితర గీతాలను సుప్రీంశేఖర్, జ్యోతి, జోసెఫ్, నీలిమ రాణి, రమేష్ పట్నాయక్, అంబికా ఆలపించారు. కళా సంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఫణిస్వామి, చీరాల ఉషా, భయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుపాశాల్లా కేబుల్ వైర్లు



ఏఎంజీ ఆస్పత్రి పక్క రోడ్డులో ఇలా..



నక్కవానిపాలెంలో వేలాడుతున్న కేబుల్

సీతమ్మధార, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో కేబుల్ వైర్లు, నెట్ వైర్లు, వాటికి సంబంధించిన బాక్స్‌లు కిందికి వేలాడుతూ బాటసారులు, వాహనదారులను తాకేలా ప్రమాదకరంగా ఉన్నాయి. నక్కవానిపాలెంలోని ఏఎంజీ ఆసుపత్రి వెనుక రోడ్డులో కేబుల్ వైర్లు, బాక్స్ కిందికి వేలాడుతూ రోడ్డు మధ్యలో ఉన్నాయి. పాదచారులు తప్పించుకుంటున్నా వాహనదారుల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. నక్కవానిపాలెంలోని పలు సీసీ రోడ్లలోనూ ఇదే తంతు. పలు విద్యుత్ స్తంభాల వద్ద కేబుల్ వైర్లు, పలు నెట్‌వర్క్‌లకు సంబంధించిన తీగలు కిందికి వేలాడుతూ ఉన్నాయి. రాత్రివేళ వాహనదారుల మెడకు తగులుతున్నాయి. వారు భయంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పగటి సమయంలో తలవంచుకొని వెళ్తున్నా, రాత్రి పూట మాత్రం ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. వేలాడుతున్న వైర్లను జీవీఎంసీ అధికారులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాని సభకు జన సమీకరణపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

నిర్మిస్తున్నారు. ఒక దాంట్లో 60 వేలు, మరో దాంట్లో 40 వేలు కుర్చీలు వేస్తున్నారు. ఇంకా రెండు హాళ్లలో కలిపి రెండు వేల మందికి సరిపడేలా 50 గ్యాలరీలు ఏర్పాటుచేస్తున్నారు. మిగిలిన వారు సభా ప్రాంగణం బయట ఉంటారు. వీరంతా ప్రధాని, ఇతర ప్రముఖల ప్రసంగాలు వినేందుకు ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి సభా వేదిక వరకు ప్రధాని రోడ్‌షోలో 60 నుంచి 70 వేల మంది పాల్గొనేలా జనాలను సమీకరిస్తున్నారు. సభ, రోడ్‌షోకు జనాలను తరలించడానికి ఆర్టీసీ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన రెండు వేల బస్సులు తీసుకుంటున్నారు. జనాల తరలింపునకు మొత్తం 300 పాయింట్లు గుర్తించారు. బస్సులు ఇటు మద్దిలపాలెం, అటు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో జనాలను దించేసి ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాలకు వెళతాయి. ప్రతి పార్కింగ్ కేంద్రానికి డిప్యూటీ కలెక్టర్/జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సభ ముగిసిన తరువాత జనాలు మద్దిలపాలెం, త్రీటౌన్ జంక్షన్‌లకు వచ్చి బస్సుల్లో ఇళ్లకు వెళ్లేలా ముందుగానే వారికి సమాచారం ఇవ్వనున్నారు.

మధ్యాహ్నం పులిహోర, రాత్రికి వెజ్ బిర్యానీ

ప్రధాని సభకు హాజరయ్యే వారికి మధ్యాహ్నం పులిహోర, పెరుగు చట్నీ, వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాక్‌తో కూడిన ప్యాకెట్ అందజేస్తారు. రాత్రికి వెజ్ బిర్యానీ, పెరుగుచట్నీ, వాటర్ బాటిల్‌తో మరో ప్యాకెట్ ఇవ్వాలని నిర్ణయించారు. జనాన్ని తరలించేందుకు 300 పాయింట్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఇచ్చేందుకు 1.2 లక్షల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. సభ అనంతరం అనకాపల్లి జిల్లాకు చెందిన వారికి 40 వేల మందికి, విజయనగరం/శ్రీకాకుళం వెళ్లే 20 వేల మందికి, జిల్లాలో నాలుగు గ్రామీణ మండలాలకు చెందిన 10 వేల మందికి పంపిణీ చేసేందుకు వెజ్ బిర్యానీ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధాని రోడ్‌షోలో పాల్గొనే 60 నుంచి 70 వేల మందికి స్నాక్స్, వాటర్ బాటిల్ అందిస్తారు. జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల పౌర సరఫరాల అధికారులు భాస్కరరావు, సూర్యప్రకాశ్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, ఇతర అధికారులు ఆహారం తయారీ, పంపిణీ బాధ్యతలు పర్యవేక్షించనున్నారు.

కళ్ల ముందు కదనరంగం

... 5వ పేజీ తరువాయి

అతిథులు ఆసీనులైన వేదిక వద్ద దిగి శభాష్ అనిపించుకున్నారు. సముద్రంలో కదులుతున్న యుద్ధ నౌకలపై హెలికాప్టర్లను సురక్షితంగా దించడం, తిరిగి టేకాఫ్ తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అటువంటి సాహసాన్ని అలవోకగా చేసి చూపించారు. ఐఎన్ఎస్ సహ్యాద్రి నౌకపైకి చేతక్ హెలికాప్టర్‌ను, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ నౌకలపైకి అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, స్టెల్త్ ఫ్రిగేట్ నౌక ఐఎన్ఎస్ సాత్పురపైకి సీ కింగ్ హెలికాప్టర్లను దించి పైలట్లు నైపుణ్యాన్ని చాటారు.

సముద్రంలో చిక్కుకుపోయిన వారిని డబుల్ ఇంజన్ కలిగిన అడ్వాన్స్‌డ్ ఏఎల్ హెలికాప్టర్‌లో వచ్చి రక్షించిన విధానం ఎంత కష్టతరమైనదో అందరికీ అర్థమైంది. సముద్రంలో బారులు తీరిన యుద్ధనౌకలు ఐఎన్ఎస్ ముంబై, కిల్తాన్, కవరత్తిల నుంచి సబ్‌మెరైన్‌లను మట్టికరిపించే రాకెట్లను ప్రయోగించి ఆహా అనిపించారు. చివరిగా నాలుగు చేతక్ హెలికాప్టర్లు, ఒక సీ కింగ్ హెలికాప్టర్, మూడు ఏఎల్ హెలికాప్టర్లు, నాలుగు డార్నియర్ విమానాలు, ఒక నిఘా విమానం పీ8ఐ, ఏడు హాక్ జెట్ విమానాలు ఒక బృందం తరువాత మరొక బృందం వేదిక ముందుగా వచ్చి అతిథుల ముందు నిర్వహించిన ఫ్లై పాస్ట్ కనువిందు చేసింది. సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ వేల అల్లంత దూరం నుంచి అందరికీ హాయ్ చెప్పి కనుమరుగైంది. ప్రదర్శన అనంతరం ఐఎన్ఎస్ సావిత్రి యుద్ధనౌక నుంచి చేసిన లేజర్ షో అలరించింది. డ్రోన్లతో ఆకాశంలో ఆవిష్కరించిన నమూనాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. నేవీ బ్యాండ్ బీటింగ్ రిట్రీట్ ప్రదర్శన, సీ క్యాడెట్ల నృత్యం, సెయిలర్ల కంటిన్యువిటీ డ్రిల్, హార్న్ పైప్ డ్యాన్సు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు హాజరయ్యారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూపాంతరం చెందుతుందన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఒప్పందం చేసుకుందని, ఇప్పటికే టీసీఎస్ భవనం కూడా ఎంపిక చేసుకుందన్నారు. మరిన్ని ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 8న ప్రధాని విశాఖలో రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తున్నామన్నారు. మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, త్వరలో విశాఖకు మెట్రో రైలు కూడా వస్తుందన్నారు. నగరంలో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియంతో పాటు టీయూ-142 కూడా తామే ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరొకటి యుహెచ్-3హెచ్ మ్యూజియం వస్తుందన్నారు. రాష్ట్రంలో వేయి కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉందని, మౌలిక వసతులు కల్పించినట్టయితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సంపద పెరుగుతుందన్నారు. గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాదే అనకాపల్లి జిల్లాకు తీసుకువస్తామని, వచ్చే ఏడాది విశాఖపట్నం తెస్తామని చంద్రబాబు ప్రకటించారు.

దేశ రక్షణలో కీలకంగా ఉండే నౌకాదళం రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కూడా అదే చొరవతో ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నదని ప్రశంసించారు. హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు తాను పది రోజులు ఇక్కడే ఉండి అన్నీ సరిచేశానని, ఆ సమయంలో నేవీ అందించిన సహకారం మరువలేనిదన్నారు. విశాఖలో తూర్పు నౌకాదళం ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తుఫాన్లు వచ్చిన ప్రతిసారి మత్స్యకారులను రక్షించడంలో కీలక పాత్ర వహిస్తుందన్నారు.

చిన్నపిల్లలు తప్పిపోతే ఆర్‌ఎఫ్ఐడీ ద్వారా గుర్తింపు

... 5వ పేజీ తరువాయి

నగర పోలీసులు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్ఐడీ) తీసుకువచ్చారు. బీచ్‌రోడ్డులో శనివారం జరిగిన నేవీ విన్యాసాలు సందర్భంగా తొలిసారి దీనిని అమలుచేశారు. నేవీ విన్యాసాలను వీక్షించేందుకు తల్లిదండ్రులతో కలిసి బీచ్‌కు వచ్చిన ఐదేళ్లలోపు పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, ఫోన్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను ఒక క్యూఆర్‌కోడ్ రూపంలో ట్యాగ్‌పై ముద్రించారు. ఆ ట్యాగ్‌లను పిల్లల చేతికి అతికించారు. ఎవరైనా పిల్లలు తప్పిపోయినప్పుడు వారి వివరాలను చెప్పలేరు కాబట్టి, తమ సెల్‌ఫోన్ ద్వారా చేతికి ఉన్న ట్యాగ్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మొత్తం సమాచారం తెలుసుకోవచ్చు. వాటి ఆధారంగా పిల్లలను వారి తల్లిదండ్రులకు వెంటనే అప్పగించేందుకు వీలుంటుంది. నేవీ విన్యాసాల సందర్భంగా శనివారం బీచ్‌కు వచ్చిన రెండు వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

... 5వ పేజీ తరువాయి

మొత్తం 5,600 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిలో తొలిరోజు 4,800 మంది భోజనం చేశారు. పది జూనియర్ కళాశాలలు, నాలుగు హైస్కూల్ ప్లస్‌లకు అక్షయపాత్ర భోజనం అందించగా, మరో ఐదు హైస్కూల్ ప్లస్‌లలో అక్కడ ఉన్నత పాఠశాలల్లో పిల్లలకు భోజనం వండే స్వయం శక్తి సంఘాలే సిద్ధం చేశాయి.

నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన పోషకాహారం లభించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కాగా, అగనంపూడి జూనియర్ కళాశాలలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నగరంలోని కృష్ణా జూనియర్ కళాశాలలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పథకాన్ని ప్రారంభించారు. మిగిలినచోట్ల స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇంటర్ విద్యాశాఖ అధికారులు పథకం ప్రారంభించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో భోజనం పథకం ప్రారంభమైందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.


బిహార్ గవర్నర్‌చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉక్కు జీఎం లలన్‌కుమార్

స్టీల్‌ప్లాంట్‌కు ప్రాంతీయ అధికార భాషా పురస్కారం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతీయ అధికారిక భాషా పురస్కారం లభించింది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో శనివారం దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల ప్రాంతీయ ఉమ్మడి అధికార భాషా సదస్సు జరిగింది. 2023-24లో అధికార భాష అమలులో స్టీల్‌ప్లాంట్ టౌన్ అఫిషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్) చేసిన కృషికి గాను మూడో బహుమతి లభించింది. బిహార్ గవర్నర్ అరీఫ్ మహ్మద్‌ఖాన్, కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ జీఎం (రాజభాష) లలన్‌కుమార్ అవార్డు అందుకున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందజేత

ఆటోనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ ఆస్పత్రిలోని ఐసీయూలో గత పది రోజులుగా చికిత్స పొందుతున్న రోగికి టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అండగా నిలిచారు. 71వ వార్డు శ్రీరామ్ నగర్‌కు చెందిన పి.సింహాచలం (76) గత కొన్ని రోజులుగా గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంగతి తెలుసుకున్న రాజారావు శ్రీరామ్ నగర్ సచివాలయ అడ్మిన్ వరలక్ష్మికి సమాచారమందించారు. తక్షణమే ఆమె స్పందించి సచివాలయ సెక్రటరీ గణేశ్‌ను ఆస్పత్రికి పంపించి సింహాచలం భార్య ధనలక్ష్మికి పింఛన్ అందజేశారు. కుటుంబ సభ్యులు సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి పనుల పరిశీలన

పెందుర్తి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి సుజాత నగర్ రవీంద్ర భారతి పాఠశాల ప్రాంతంలో రూ.13.5 లక్షలతో చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటరు ముమ్మన దేముడు శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఇంజనీరింగ్ అధికారి భద్ర, స్థానిక కాలనీ ప్రతినిధులు కొమ్మాన సన్యాసిరావు, పైడికొండ, రామకృష్ణ, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

బోరింగ్ ప్రారంభం

పెదగంట్యాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి పెదకోరాడలో ఏర్పాటు చేసిన బోరింగ్‌ను టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదకోరాడ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని స్థానికులు తన దృష్టికి తేవడంతో సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బోరింగ్ ఏర్పాటుకు కృషి చేశానన్నారు. టీడీపీ నాయకుడు బొసెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 42, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం ఎర్రగా...

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- పలుచోట్ల డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

అగనంపూడి, జనవరి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కార్పొరేట్ కాలేజీలకు దీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.27 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వచ్చే ఏడాది నుంచి విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను కూడా అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అగనంపూడి జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం పల్లా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, బొండా జగన్, జనసేన నేత కోన తాతారావు, ఎంఈవోలు సునీత, జగన్నాథ్, ప్రిన్సిపాల్ సుధాకరబాబు, నాయకులు కర్రి దేశేంద్ర, జి.సోమశేఖర్, ఎం.విజయ్, గొల్లవిల్లి కనకభవానీ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి జూనియర్ కళాశాలలో..

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించటమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాంపురంలో మహిళా జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెన్నెల సన్యాసినాయడు, ఎమ్‌ఈవో మూర్తి పాల్గొన్నారు.


పెందుర్తిలో భోజనాలు వడ్డిస్తున్న పీలా శ్రీనివాసరావు, తదితరులు

మల్కాపురం కాలేజీలో..

మల్కాపురం: గ్రేటర్ విశాఖ 61వ వార్డు మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ములగాడ మండల విద్యాశాఖ అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల సూచన మేరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్న), రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కాకి పోలిరెడ్డి, కొరిబిల్లి రాము, 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, జనసేన నాయకుడు దేవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి అపూర్వ స్వాగతం

రైల్వే స్టేషన్ నుంచి అక్కిరెడ్డిపాలేనికి ఊరేగింపుగా తీసుకువచ్చిన స్నేహితులు, కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో సుబేదారుగా సుమారు 30 ఏళ్ల పాటు ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసి స్వగ్రామానికి విచ్చేసిన కంపర శ్రీనుకు అపూర్వ స్వాగతం లభించింది.

డిసెంబరు 31న పదవీ విరమణ చేసిన అక్కిరెడ్డిపాలేనికి చెందిన శ్రీను ఆర్మీలో వివిధ హోదాలలో పనిచేశారు. శనివారం ఇక్కడకు వచ్చిన ఆయనకు కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, తదితరులు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపుగా అక్కిరెడ్డిపాలెం తీసుకువచ్చారు. ఆయన విద్యనభ్యసించిన అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌వద్ద కాలనీవాసులతో పాటు విద్యార్థులు శ్రీనుకు పువ్వులు చల్లి స్వాగతం పలకగా, హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. దేశ రక్షణ కోసం ఎనలేని సేవలందించిన శ్రీను వంటి వ్యక్తులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆమె కోరారు. దేశ రక్షణ కోసం సేవలందించిన తనకు ఇంత ఘనంగా స్వాగతం లభించడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీను పేర్కొన్నారు.


శ్రీనుకు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం కాంతం, తదితరులు

భూ సమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


అర్జీలు స్వీకరిస్తున్న పల్లా, తహసీల్దార్ శ్రీవల్లి, తదితరులు

కూర్మన్నపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ కాలనీలో 22-ఏ జాబితాలో ఉన్న పేదల భూములపై నిషేధం ఎత్తివేత, ఆరు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఏపీఐఐసీ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 87వ పరిధి వార్డు వడ్లపూడిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూముల కంప్యూటరీకరణ, సర్వే, తదితర సమస్యలపై వడ్లపూడి, ఏపీఐఐసీ నిర్వాసితులు వినతులు అందజేస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేటప్పుడు బాధితులతో చర్చించాలని సూచించారు. అధికారులు చక్కగా పని చేసినప్పుడే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. పాత వడ్లపూడి, శ్రీగణేశ్ నగర్, 90 ఫ్లాట్స్ ఏరియా, కణితి, తిరుమల నగర్, ఆటోనగర్, ఎన్టీఆర్ నగర్‌లలో ఆక్రమణలకు గురైన సర్కారు స్థలాలపై విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని భూబాధితులకు. నిర్వాసితులకు న్యాయం చేస్తామనీ హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ బాధితుల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న ఉక్కు నిర్వాసిత కాలనీవాసుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం స్వర్ణాంధ్రగా రూపుదిద్దుకుంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ఎస్.కనకరాజు, బి.నాగేశ్వరరావు, వర్రె రాంబాబు, ఎస్.పెంటారావు, రాజన్‌రాజు, పిజదానయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో 9 అర్జీల స్వీకరణ

పెందుర్తి: సరిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎన్‌హెచ్-16 ఎస్‌డీసీ సీతారామారావు కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ భూ సమస్యలకు సంబంధించిన 9 అర్జీలను స్వీకరించారు. ఇందులో ఆర్వోఆర్ సంబంధిత దరఖాస్తులు 4, ఎఫ్-లైన్‌కు సంబంధించిన అర్జీలు ఐదు ఉన్నాయి. ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, జంగాలిపాలెం సర్పంచ్ గొరపల్లి నర్సింగరావు, వీఆర్వో గాలి పేతూరు, భూ సమగ్ర సర్వే డీటీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైట్ కంటైనర్‌లో పట్టుకున్న బియ్యం విడుదలకు జేసీ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గత నెల 14న విశాఖ పోర్టు పరిధి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో పట్టుకున్న 259 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన కెర్నల్స్ ఇతర అవశేషాలు లేవని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో నిల్వ చేసిన కాకినాడకు చెందిన బెబో ఇంటర్నేషనల్‌కు 461 టన్నుల బియ్యాన్ని గతనెల తొమ్మిదిన సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఆ తర్వాత బెబో ఇంటర్నేషనల్‌కు చెందిన మరో ఎనిమిది లారీల్లో 259 టన్నుల బియ్యాన్ని ఇదే గోదాముకు తీసుకువచ్చినపుడు వాటి నుంచి శ్యాంపిల్స్ తీసుకుని పౌరసరఫరాల సంస్థ లేబోరేటరీకి పంపామన్నారు. అక్కడ చేపట్టిన పరీక్షల్లో రేషన్ బియ్యం లేనట్టు నిర్ధారణ అయిందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నివేదిక ఇచ్చారన్నారు. దీంతో పట్టుబడిన 259 టన్నుల బియ్యాన్ని బెబో ఇంటన్నేషనల్‌కు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. అయితే గత నెల తొమ్మిదో తేదీన పట్టుకున్న 461 టన్నుల బియ్యంపై విచారణ కొనసాగుతుందని జేసీ తెలిపారు.

అధునాతన బోధనపై అవగాహన

అగనంపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో అధునాతన బోధనా విధానంపై అధ్యాపకులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మార్పులకు తగ్గట్టుగా అధ్యాపకులు బోధించాలని సూచించారు. శివకుమార్‌ను విజ్ఞాన్ యాజయాన్య ప్రతినిధులు సత్కరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దాబాలో అగ్నిప్రమాదం: రూ.5 లక్షల ఆస్తి నష్టం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఆనుకొని నాతయ్యపాలెం వద్దనున్న ఓ దాబాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని పమాదంలో దాబాతో పాటు వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకున్నాక యజమాని బాబ్జీ దాబాకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే దాబాతో పాటు వంట గదిలోని, స్టోర్ రూమ్‌లోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. ఈ ప్రమాదం వల్ల సుమారు రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాబ్జీ తెలిపారు.

ఇద్దరు స్క్రాప్ దొంగలు పట్టివేత

పెందుర్తిరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పగటి పూట పనిలోకి వచ్చి రాత్రి వేళల్లో స్క్రాప్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకుని లక్ష్మీపురం వాసులు పెందుర్తి క్రైమ్ పోలీసులకు అప్పగించారు. 95వ వార్డు పరిధి లక్ష్మీపురం పెదగాడి రహదారిలో ఇటీవల ఇనుప సామగ్రి చోరీలు అధికమవ్వడంతో స్థానికులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరు అనుమానాస్పదంగా సంచరించడంతో వారిని పట్టుకుని నిలదీశారు. వారు ఇనుప చువ్వలు చోరీ చేసిన దొంగలని తేలడంతో వారిని నేర విభాగ పోలీసులకు అప్పగించారు. దీనిపై క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు.

బీఎంఎస్ స్టీల్‌ప్లాంట్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెర్రిపోతుల రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గురుప్రసాద్, కోశాధికారిగా రామసాయి, ఉపాధ్యక్షుడిగా ఎం.పెంటారావుతో పాటు మరికొంత మందిని సభ్యులుగా నియమితులయ్యారు. నూతన కార్యవర్గం మొత్తం ప్లాంటులో 2007 తర్వాత విధుల్లో చేరిన యువ కార్మికులే. కార్యక్రమంలో నాయకులు పి.హనుమంతురావు, కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర


ఉపాధ్యాయులను సత్కరించిన 'ఓబీసీ' ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్టీల్‌ప్లాంట్ జీఎం ఎన్.భాను అన్నారు. ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని పేర్కొన్నారు. అనంతరం వివిధ పాఠశాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బి.అప్పారావు, ఉమామహేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, నారాయణ, శ్రీనివాస్, కామేశ్వరరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాక్ సెంటర్‌లో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టీపీవో డిజిటల్ ఇండియా, సెల్ పాయింట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చని, ఎంపికైన అభ్యర్థులకు విశాఖ జిల్లాలోనే ఉద్యోగం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 967670026 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కు అనుసంధానమైన నంబర్‌తో ఉన్న ఫోన్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

86వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ కార్యకర్తలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నాయకత్వ లక్షణాలు లభిస్తాయని పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధిలోని కొత్త రాసాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్‌లలో శనివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో భాగంగా ఇంటింటికీ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, వెంకటేశ్, సుబ్బయ్య, రమేశ్, గణపతి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ క్లబ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ స్టీల్ క్లబ్ నూతన పాలక వర్గానికి జరగనున్న ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. కార్యదర్శి పోస్టుకు నలుగురు, కోశాధికారి పోస్టుకు ఐదుగురు, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా 11మంది పోటీలో ఉన్నారు. జాయింట్ కార్యదర్శి పోస్టు ఏకగ్రీవం అయ్యింది. ఈ నెల 9వ తేదిన మధ్యాహ్నం 1నుంచి 3.30, మరల సాయంత్రం 5.3నుఉంచి రాత్రి 8గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం లెక్కింపు, ఫలితాలు విడుదల చేయనున్నారు.

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి హానికరం

గాజువాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి తీవ్ర హనికరమని గాజువాక ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. గాజువాకలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పలు అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, క్లాత్ సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెయిల్‌లో 'ఉక్కు'ను విలీనం చేయాలని ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్లాంట్‌లోని ఆయా విభాగాల ముందు ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, యెల్లేటి శ్రీనివాసరావు, డీవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంటుపై పీఎం మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి'

కూర్మన్నపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార శనివారం నాటికి 1,423వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం ఆదివారం ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో పాదయాత్రలు, ఆరున చలో కలెక్టరేట్, ఏడున 36 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నామన్నారు. మరో చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే నాలుగు నెలల జీతం బకాయిలను చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభకు మద్దతుగా ర్యాలీ

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సనాతన భారతీయ ధర్మ పరిరక్షణ కోసం విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ బుచ్చిరాజుపాలెం గౌరీ సేవా సంఘం, హిందూ సంఘాలు సంయుక్తంగా శనివారం సాయంత్రం బుచ్చిరాజుపాలెం నుంచి ఎన్ఏడీ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీహెచ్‌పీ సామాజిక సమరసత అభియాన్ జిల్లా ప్రముఖ్ మీసాల రవీంద్ర మాట్లాడుతూ హిందూ సనాతనధర్మం పరిరక్షణ ప్రతీ హిందువు ప్రాథమిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పి.కోటేశ్వరరావు, మళ్ల కనకరాజు, దొడ్డి సతీశ్, ఎం.హరికృష్ణ, మహాలక్ష్మీనాయుడు, సంతోశ్, రెడ్డి జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం కావాలని పూజలు

పెదగంట్యాడ: హైందవ శంఖారావం సభ విజయవంతం కావాలని వీహెచ్‌పీ పెదగంట్యాడ శాఖ సభ్యులు దయాళ్‌నగర్ సాయి సంతోషిమాత అభయాంజనేయ దేవతామూర్తులకు పూజలు చేశారు. దేవాలయాలకు, ధార్మిక సంస్థలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం విజయవాడలో ఆదివారం జరగనున్న శంఖారావ సభకు బయలుదేరారు. కార్యక్రమంలో సభ్యులు గొందేశి గురప్పరెడ్డి, వి.నాగబాబు, వీరేశ్వరరావు చాముండేశ్వరి, కోటేశ్వరమ్మ, పార్వతి, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు: ఉక్కు జీఎం రాజు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్) ఎన్‌వీఎస్ రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ డీపీఎస్‌లో వార్షిక క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా విద్యార్థుల్లో చురుకుదనం, మేధోశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం పలు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, ఎల్ఎంసీ సభ్యుడు లీలాశ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు

ఎన్.ఎ.డి. జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్ట్‌లో హెల్తీ వాకర్స్ బుచ్చిరాజుపాలెం పినాకిల్ మానసిక వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగ చిన్నారులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆద్యంతం.. అద్భుతం



ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న కమెండో



సంద్రంలో ఉన్న సబ్‌మెరైన్‌కు సమీపంలో హెలికాప్టర్



కార్యక్రమంలో డ్రోన్ షో ప్రదర్శన

విశాఖ సాగరతీరంలో శనివారం నావికాదళ సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు ఆద్యంతం అద్భుతంగా సాగాయి. హెలికాప్టర్ల నుంచి నడిసంద్రంలో ఉన్న బోట్లపైకి తాళ్ల సహాయంతో చేరి శత్రుమూకలపై విరుచుకుపడడం, సాగరంలో చిక్కుకుపోయిన వారిని డబుల్ ఇంజీన్ అడ్వాన్స్‌డ్ ఏఎల్ హెలికాప్టర్‌లో వచ్చి రక్షించిన విధానం చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. సాగర జలాలపై కదులుతున్న యుద్ధ నౌకలపై హెలికాప్టర్లతో దిగడం, ఎనిమిది వేల అడుగుల పైనుంచి పారాచూట్‌ల సహాయంతో సభా వేదిక వద్దకు చేరడం వంటి విన్యాసాలను కళ్లార్పకుండా అందరూ తిలకించారు. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఆకాశంలో చక్కర్లు కొట్టిన విధానం, సంద్రంలో ఆయిల్ రిగ్ పేలుళ్లు, నేవీ బ్యాండ్, సీ క్యాడెట్ల నృత్యం, ఫైర్ వర్క్స్, లేజర్ షో వంటివి సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి.




యుద్ధ నౌకపై దిగుతున్న హెలికాప్టర్





విన్యాసాల గురించి చంద్రబాబునాయుడుకు వివరిస్తున్న తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్



లేజర్ షో..



కలర్‌ఫుల్ ఫైర్ వర్క్స్..



కంటిన్యుటీ ఫైర్ డ్రిల్ చేస్తున్న సిబ్బంది



సముద్రంలో ఆయిల్ రిగ్ పేల్చివేతను తిలకిస్తున్న జనం



హెలికాప్టర్ల విన్యాసాలు



విన్యాసాలను వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

డాబాగార్డెన్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసమే కూటమి ప్రభుత్వం తపన పడుతోందని, అందులో భాగంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం పాత జైల్‌రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులతో మమేకమై 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్నత విద్యకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కళాశాలలో వివిధ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం పెంచి, వారికి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా ఈ పథకం అమలవుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన మంత్రి, ప్రముఖులు, విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీఓ పి.శ్రీలేఖ, ఎమ్మెల్సీ రామారావు, డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, ప్రిన్సిపాల్ విజయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు

భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం జైపూర్‌కు చెందిన మాడుకొండ శంకరరావు (40) బతుకు తెరువు కోసం ఎనిమిదేళ్ల క్రితం 88వ వార్డు పరిధి మంగళపాలెం వచ్చి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో భార్య నాగమణి, రెండేళ్ల కుమారుడితో ఉంటున్నారు. పరవాడలోని ఓ ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆయన శనివారం ఉదయం మూడో అంతస్థు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అయితే శంకరరావు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియ రాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- ఇతడు వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు



మృతుడు రాయవరపు వెంకటేశ్ (పాతచిత్రం)

పెందుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బంగారం కోసం వృద్ధురాలిని హతమార్చిన కేసులో నిందితుడైన ఓ యువకుడు ఏడాదిన్నరలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పురుషోత్తపురానికి చెందిన రాయవరపు వెంకటేశ్ (28) అరకులోని ఓ రిసార్ట్‌లో పనిచేసేవాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై స్నేహితుడితో కలిసి చీమలాపల్లి మీదుగా తన ఇంటికి బయలుదేరాడు. వేపగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బైక్ ప్రమాదవశాత్తు స్కిడ్ అయ్యింది. బైక్ నడుపుతున్న వెంకటేశ్ కిందకు జారిపడటంతో తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెనుక కూర్చున్న అతడి స్నేహితుడు గాయపడ్డాడు. వెంకటేశ్‌ను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని సీఐ తెలిపారు. రాయవరపు వెంకటేశ్ గత ఏడాది జులై 31న సుజాతనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కోటగిరి వరలక్ష్మి అనే వృద్ధురాలిని బంగారు ఆభరణాల కోసం హతమార్చిన కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు. అప్పట్లో వాలంటీర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్ వృద్ధురాలిని హతమార్చడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ క్రమంలో వృద్ధురాలి కుటుంబాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పరామర్శించారు. ఆ హత్య కేసులో జైలుకెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చిన వెంకటేశ్ ఏడాదిన్నర కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం గమనార్హం. సీఐ సతీశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. వెంకటేశ్‌కు భార్య, కుమార్తె ఉన్నారని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైందని పెందుర్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చినముషిడివాడలో నివాసముంటున్న ఈ బాలిక (16) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాలకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో కుమార్తె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సతీశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.